మహామాయ..22

# అశ్రుధార

డిటెక్టివ్ & మిస్టరీ నవల.



రచన....

కనకమేడల

50 np.

మహామాయ-22

# అశ్రుధార

రచన

కనకమేడల

VIGNANA SAHITI
MADRAS-17

ప్రథమ ముద్రణ
జూలై 1957

## పాఠకులకు, ఏజెంట్లకు

ఇది మహామాయ-22 వ పుస్తకం. ఈ సీరియల్‌లో ఇంకా రెండు పుస్తకాలు మాత్రం మిగిలి ఉన్నాయి. ఏజెంట్లు వెంట వెంటనే డబ్బు పంపి తెప్పించుకొనేట్లయితే మిగిలిన రెండు భాగాలు కూడా వెంటనే వెలువరించి ఆగస్టు 15 వ తేదీన స్వాతంత్ర్య సమర శత వార్షికోత్సవ సందర్భంగా క్రొత్త డిటెక్టివ్ సీరియల్ 'ఇంద్రజిత్' లోని మొదటి భాగాన్ని వెలువరించాలనుకుంటున్నాం. ఇందుకు మీ సహకారం అవసరం.

'కథానిక' విషయంలో కొందరు ఏజెంట్లు శ్రద్ధ చూపుతున్నట్టు కనిపించడంలేదు. ఆయా ఊర్లలో ఇతర ఏజెంట్లు ఏజన్సీ కోరేట్లయితే ఏజన్సీ మార్చగలమని తెలియచేస్తున్నాం.

అభినందనాలతో,
డైరెక్టర్లు

వెల
50 న. పై.

ముద్రణ
సాహితీ ప్రింటర్స్
మద్రాసు-17

రఘువీర్ మహారాజు తనకు వ్యతిరే
కంగా దారుణ కృత్యాలు చేస్తున్న
సుతా జాడలు కనుక్కునే సంద
ర్భంలో బాబాజీ సాయం కోరాడు.
బాబాజీ తనకీ కష్టసాధ్యమైన పనిలో
తోడుగా ఉండవలసిందిగా యమదూ
తను కబురంపాడు. వెంటనే యమ
దూత కార్యరంగంలోకి దూకాడు.
మంత్రి సాధు పన్నుతున్న పన్నాగా
లను తెలుసుకున్నాడు. కొన్ని రహస్య
పత్రాలను సంపాదించి వాటిని బాబా
జీకి పంపాడు. కాని ఇంత జరిగినా
జరగవలసిన దారుణకార్యం ఆగలేదు.
రఘువీర్ మహారాజు నవ వధువు
తారుమారు చేయబడింది. కాని
ఈ రహస్యం ఎవరికీ తెలియలేదు.
యమదూత కూడా ఈ సందర్భంగా
మౌనం వహించాడు. తర్వాత—

## 1

వర్షం కుండపోతగా కురిసి వెలిసింది. ప్రపంచం చల్ల బడింది. చల్లనిగాలి కూడా పెద్ద పెట్టున అడపా దడపా వీస్తోంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. అడవిలోని చెట్ల ఆకులమీద నిలిచిన నీటి బొట్లు మసక వెలుగులో మెరుస్తున్నాయి.

అడవిలోంచి ఒక గుర్రం దూసుకుంటూ మైదానంలోకి వచ్చింది. దానిమీద ప్రయాణం చేస్తున్న వ్యక్తి ఎవరో మారువేషంలో ఉన్నట్టున్నాడు. గుర్రం మైదానంలో ప్రవేశించగానే అతను దానిని ఆపి దిగాడు. ఒకసారి నాలుగు ప్రక్కలా కలయచూసి గుర్రాన్ని అక్కడే వదలి అతను ముందుకు సాగాడు.

గుర్రం అడవిలో ఉన్న పచ్చని చెట్లవైపు తిరిగింది. అతను వెనక్కి తిరిగి చూడకుండా మైదానాన్ని ఆనుకుని ఉన్న కొండలబారు వెంబడి ప్రయాణం ప్రారంభించాడు. అతనలా చీకట్లో చాలదూరం సాగిపోయాడు.

చివరికొక గుహ దగ్గర ఆగి అతను లోపలికి చూశాడు. లోపల బాగా చీకటిగా ఉంది. కాసేపటివరకు అతనక్కడే మౌనంగా నిలబడ్డాడు. లోపలినించి ఎవరూ బయటికిరాలేదు. బయటినించి ఎవరూ లోపలికిపోలేదుకూడా.

ఆ వెంటనే అతను గుహలో అడుగు పెట్టాడు. చీకటిలోనే ముందుకు నడచి తనకు పరిచితమైన సొరంగ మార్గంలో ప్రవేశించాడు. తలుపు తెరిచేసరికి అక్కడ నిలబడి ఉన్న భటుడొకడు ఆశ్చర్యంగా అతని వంక చూశాడు.

ఆ వ్యక్తి చేసిన సంజ్ఞను గ్రహించగానే భటుడు మందహాసం చేశాడు. అతను తిన్నగా ముందుకు నడచి అక్కడున్న ఒక కుర్చీలో కూలబడ్డాడు.

"మంత్రిగారెక్కడ?" అతను భటుడివంక చూసి ప్రశ్నించాడు.

"లోపల ఉన్నారు," భటుడు సమాధానమిచ్చాడు.

"నిద్రపోతున్నారా?" అతను మళ్ళీ అడిగాడు.

"ఏమో తెలియదు," మళ్ళీ సమాధానం వచ్చింది.

ఆ వ్యక్తి ఒకసారి కుర్చీలో వెనక్కి వాలి ఏదో గంభీరాలోచనలో మునిగిపోయాడు. ఇంతలో తలుపు తెరచిన చప్పుడైంది. అతను ముందుకు చూశాడు. మంత్రిసాధు పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ఆ గదిలో ప్రవేశించాడు. ఎదురుగా ఉన్న వ్యక్తిని చూడగానే అతనికి కొంచెం ఆశ్చర్యం కలిగింది. మరుక్షణంలో అతని చూపులు భటుడి మీదకి తిరిగాయి.

ఇంతలో ఆ వ్యక్తి అన్నాడు.

"మీరు నన్ను గుర్తుపట్టలేకపోయారన్నమాట!"

సాధు మళ్ళీ ఆశ్చర్యంగా అతని వంక చూశాడు. కాని అతనెవరో తెలియటంలేదు. ఏమీ మాట్లాడలేదు.

"మీ రిలాగే ఒకోసారి మోసపోతుంటారు." అంటూ ఆ వ్యక్తి తన పొడుగాంటి మీసాలు ఊడపీకాడు. మందహాసం చేస్తూ సాధు వంక చూశాడు.

"నువ్వా టిక్కాకి? మొత్తానికి మారువేషాలు వెయ్యడంలో గట్టివాడివే!" అన్నాడు సాధు.

టిక్కారి నవ్వాడు. "నేను మారువేషం వేస్తే ఇతరులు తెలుసుకోగలగడం కల్ల. అయితే నాకంటే మారువేషాలు వెయ్యడంలో సమర్థులైనవారు ఇద్దరున్నారు."

"ఎవరు వాళ్ళు?" సాధు ఆతురతగా అడిగాడు.

"ఒకతను మీకు బాగా పరిచితుడు. మీ చిరకాల మిత్రుడు, యమదూత. రెండవ వ్యక్తితో మీ కంతగా పరిచయం ఉన్నట్టు కనిపించదు. అతను నరేంద్రమహారాజు గారి గూఢచారి దళనాయకుడు మంత్రవాది" అన్నాడు బికారి.

మంత్రిసాధు మాట్లాడలేదు. తన ఆసనంలో విశ్రాంతిగా వెనక్కి వాలి ఏమిటి విశేషాలన్నట్టు బికారి వంక చూశాడు.

బికారి కాసేపు మాట్లాడలేదు. తర్వాత విచారంగా సాధు వంక చూశాడు.

"యమదూత నిజంగానే మనల్ని మోసగించాడు."

"ఏం?" ఆతురతగా అడిగాడు సాధు.

"అతను మన కప్పగించిన ఉత్తరాలు సరయినవికావు. వాటికి నకళ్ళు. స్వయంగా యమదూతే నకలు చేసి ఉండవచ్చు."

"అతనడిగిన డబ్బు నువ్వు పూర్తిగా ఇచ్చేశావు కదూ?"

"ఇచ్చింతర్వాతనే అతడా ఉత్తరాల పెట్టె ఇచ్చాడు."

"మొత్తానికి సామాన్యుడు కాదు."

సాధు ఆలోచనలో మునిగిపోయాడు. యమదూత తనను మోసగించి చాలా డబ్బు తమ దగ్గరినించి రాబట్టుకున్నాడు.

"పోనీ, జరిగిందేదో జరిగిపోయింది. ఆ ఉత్తరాలు నకలు లైనా ఫర్వాలేదు. జాగ్రత్తగా దాచి ఉంచు. తర్వాత ఎప్పుడైనా పనికి రావచ్చు. ఏది ఏమైనా మన పని జరిగిపోయింది. ఇప్పుడు యమదూత అడ్డుతగలడాని కేమీ

ఆస్కారం లేదు. ఇప్పుడు మన రహస్యాన్ని అతడు బయట పెడితే అతడి రహస్యం కూడా బయట పడుతుంది. అందు చేత ఆ పని చెయ్యడు," అన్నాడు చివరికి సాధు.

"నిజమే. మనం అతని చేతిలో ఎలా ఇరుక్కున్నామో, ఇప్పుడతను కూడా మన చేతిలో అలా ఇరుక్కున్నాడు," అన్నాడు బికారి సాభిప్రాయంగా.

అతని మాటల్లోని ముఖ్యాభిప్రాయం మంత్రికి తెలియక పోయినా అతను కూడా మందహాసం చేస్తూ తల ఊపాడు. అయినా అతని మనస్సు ఏదో ఆలోచన పట్టుకు పీడిస్తూనే ఉంది. అదే ఆలోచిస్తూ కాసేపతను మౌనం వహించాడు.

"కాని నా కొక అనుమానం కలుగుతోంది," బికారి అన్నాడు.

సాధు మాట్లాడలేదు. ఏమిటన్నట్టు బికారి వంక చూశాడు.

"మన అసలు ఉత్తరాల పెట్టెను యమదూత బాబాజీ దగ్గరికి పంపి ఉండాలి," అన్నాడు బికారి.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను. అతనా పెట్టెను తన దగ్గరే దాచాడా లేక ఎవరికైనా పంపాడా అని ?"

'దాని నకిడు బాబాజీకి పంపి ఉండాలని నా నమ్మకం"

"బాబాజీకి ఆ ఉత్తరాల పెట్టె చేరితే అపాయకరమే!" సాధు విచారంగా అన్నాడు.

'అయితే ఆ పెట్టె బాబాజీ కింకా చేరి ఉండదు. ఆయన ఈ మధ్య తన స్వంత భవనానికి వెళ్ళలేదు," అన్నాడు బికారి.

"ఔను. ఉత్తరాల పెట్టెచేరి మన ప్రయత్నం విషయం బాబాజీకి తెలిసి ఉంటే విషమ పరిస్థితు లేర్పడి ఉండేవి. అలా జరగలేదు కాబట్టి ఉత్తరాల పెట్టె బాబాజీకి చేరి ఉండదనే అనిపిస్తోంది," అన్నాడు సాధు.

"అనిపించడం కాదు, చేరలేదని నా దృఢ విశ్వాసం. బాబాజీ గత వారమంతా భవానీపురం ప్రాంతాలలోనే ఉన్నాడు. తన రహస్య భవనానికి పోలేదు. యమునామాత ఆ పెట్టెను బాబాజీ రహస్య భవనానికి పంపి ఉంటూను," అన్నాడు నిశ్చయ పూర్వకంగా బికారి.

"బాబాజీ రహస్య భవనం నీకు తెలుసుకదూ?"

"తెలుసు."

"అక్కడ ఎవరెవరుంటున్నారో నీకేమైనా తెలుసా?"

"ఆయన కుమార్తె, ఒకరిద్దరు అనుచరులు ఉండి ఉంటారు."

"అయితే నువ్వొకసారి రహస్యంగా అక్కడికి చేరుకుని ఆ పెట్టెను చేజిక్కించుకోడానికి ప్రయత్నించడం మంచిదనుకుంటాను," అన్నాడు చివరికి సాధు.

"నేనదే ప్రయత్నంలో బయలుదేరి మీ అనుమతికోసం ఇక్కడికి వచ్చాను. మీరుకూడా అదే ఉద్దేశంలో ఉన్నారు కాబట్టి నేను నా పనిమీద బయలుదేరి వెళ్ళవచ్చనుకుంటాను," బికారి అన్నాడు.

"అలాగే," అన్నాడు సాధు.

బికారి లేచి నిలబడ్డాడు. ఊడిపోయి ఉన్న మీసాన్ని గట్టిగా అతికించుకున్నాడు.

"చాలా జాగ్రత్తగా వెళ్ళి రావాలి సుమా," సాధు అన్నాడు.

"ఆ విషయంలో పూచీనాది. బాబాజీకి కూడా నే నక్కడికి వెళ్ళిన విషయం తెలియడం అసంభవం," బికారి నమ్మకంగా అన్నాడు.

"అన్ని విషయాలు తెలుసుకుని సందర్భానుసారంగా అవసరమైతే మాలతిని బంధించి తీసుకురా." అన్నాడు సాధు.

"అవన్నీ నేను చూసుకుంటాను. మీరు కంగారుపడ నవసరంలేదు," బికారి అన్నాడు.

సాధు చిరునవ్వు నవ్వి మౌనం వహించాడు. బికారి వెనక్కి తిరిగి రెండడుగులు ముందుకు వేశాడు. అకస్మాత్తుగా సాధు కేదో గుర్తు వచ్చింది.

"ఖైదీల నందరినీ కట్టుదిట్టంలో ఉంచావు కదూ ?" అనుమానంగా అడిగాడు సాధు.

"మీకా విషయంలో కూడా సందేహం అక్కరలేదు. ఖైదీలందరూ తగిన చోట్ల ఉన్నారు. వాళ్ళు తప్పించుకోవడానికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టాలు చేశాను. బయటికి వాళ్ళు విడిపించడానికి మన స్థావరమే వాళ్ళకు తెలియదు గా," అన్నాడు బికారి.

సాధు సంతృప్తిగా నవ్వాడు బికారి గబగబా నడచి గుహలోంచి కాసేపటిలో బయటపడ్డాడు. ఒకసారి నాలుగు ప్రక్కలా కలయ చూశాడు. కాని చుట్టు ప్రక్కల ఎవరూ

లేరని గట్టిగా నిశ్చయించుకున్నాక అతను అక్కడినించి కొండలబారు వెంబడే వెనక్కి తిరిగాడు

చివరికి మైదానం దాటి అరణ్యంలో అడుగు పెట్టగానే చెట్ల మధ్యగా నిలబడి ఉన్న అతని గుర్రం కనబడింది వెంటనే అతను దాని దగ్గరికి వెళ్ళాడు. గుర్రం తన యజమానిని చూసి ఆనందంగా సకిలించింది.

బికారి మరుక్షణంలో గుర్రంమీదికి దూకి కళ్ళెం వదిలాడు. గుర్రం వాయువేగంతో చెట్ల సందుగా ముందుకు దూసుకుపోయింది

బికారి వెళ్ళిన కాసేపటికి ఒక పెద్ద చెట్టుమీదనించి ఒక వ్యక్తి క్రిందకి దిగి మైదానం దాటి కొండలబారు వెంబడి నడచిపోసాగాడు.

## 2

యమదూతకేమీ తోచడంలేదు. తన గుహలో అటూ ఇటూ కాలు కాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. డబ్బుకోసం ఆశపడి తాను చేయరాని నేరం చేశాడు. తాను నకలుచేసి దాచిన ఉత్తరాల పెట్టెను బికారికిచ్చి తాను డబ్బు పుచ్చుకున్నాడు. ఆ పెట్టెతోపాటు తాను బంధించి ఉంచిన బికారి అనుచరుణ్ణి కూడా అతనికప్పగించి వేశాడు.

ఇలా చెయ్యడంలో తన అసలు ఉద్దేశం వేరు. తాను బాబాజీకి అసలు ఉత్తరాల పెట్టెను పంపాడు. ఆ ఉత్తరాలు చదవగానే బాబాజీ సంగతులన్నీ గ్రహించి తగిన చర్య తీసుకుంటాడని తా నాశించాడు. అందుకే తన దగ్గర

ఉన్న నకలు ఉత్తరాల పెట్టెను బికారికిచ్చినా నష్టమేమీ లేదనుకున్నాడు.

కాని అలా జరగలేదు. తాను పంపిన ఉత్తరాల పెట్టె బాబాజీకి చేరి ఉండదు. ఇప్పుడు తాను పెద్ద నేరం చేసినట్టె లెక్క. తన అపరాధం మన్నించరానిది. మంత్రిసాధు రాజ్యానికి, రాజుకు సంబంధించిన ఒక ముఖ్య విషయంలో తాను తగిన చర్య తీసుకోకపోవడం నేరం కాక మరేమిటి ?

ఈ సంగతి బాబాజీకి తెలిస్తే ఆయన తననిక నమ్మడు. అందుచేత తనమీద ఆయనకున్న విశ్వాసం పోకుండా ఏదో ఒక పద్ధతి చూడాలి. ముఖ్యంగా డబ్బుమీద తనకున్న ఆశ ఇంత అనర్థానికి దారి తీసింది.

అసలు తాను పంపిన ఉత్తరాల పెట్టె బాబాజీకి చేరక పోవడానికి కారణమేమిటో తన కింకా తెలియలేదు. బాబాజీ భవనంలో లేరు; అందుచేత ఉత్తరాల పెట్టెను మాలతికిచ్చి వచ్చానని తన అనుచరుడు వచ్చాడు.

ఒకవేళ బాబాజీకి తర్వాత ఆ పెట్టె అందినా ఆయన తగు చర్య తీసుకుని ఉండేవాడు. ఆలోచించి చూస్తే ఏదో వింత సంఘటన జరిగినట్లు అనిపిస్తోంది. బాబాజీకి ఇంత వరకు ఆ ఉత్తరాలపెట్టె చేరి ఉండదు. సాధు చేసిన దారుణ కార్యంకూడా తెలిసి ఉండదు.

ఈ పరిస్థితిలో తానుకూడా ఆ విషయాన్ని గురించి ఆయనకు చెప్పక పోవడమే మంచిది. చెబితే తన రహస్యం బయటపడుతుంది. ఆయన తనను ముఖ్య నేరస్థుడుగా భావిస్తాడు.

ఏం జరుగుతుందో చూడవచ్చు. తానీ విషయంలో మౌనం వహించడమే శ్రేయస్కరం. లేకపోతే అపాయాలన్నీ తన నెత్తికి చుట్టుకుంటాయి.

యమదూత ఈ విషయాలన్నీ ఆలోచిస్తూ గుహలో అటూ ఇటూ పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. ఒకరిద్దరు అనుచరులు అక్కడ కూర్చుని ఉన్నారు. కాని అతనే విషయం ఆలోచిస్తున్నాడో మాత్రం వాళ్ళకు తెలియదు. అడగడానికి ఎవరికీ ధైర్యం లేదు.

యమదూత తాను నకలు ఉత్తరాల పెట్టెను బికారికి అమ్మిన విషయం తన అనుచరులకు కూడా తెలియనివ్వలేదు.

ఇంకా యమదూత తిరగడం మానలేదు. అతని ఆలోచనలు అకస్మాత్తుగా బాబాజీ మీదనించి సాధు మీదకు తిరిగాయి.

సాధు తాను చేసిన మోసాన్ని గ్రహించి ఉంటాడు. ఇదివరకటి పరిస్థితిలో అయితే అతనిని తాను మోసగించినా ఫర్వాలేదు. ఇప్పుడు సాధు చేతిలో తాను చిక్కినట్టే లెక్క. తాను నకలు చేసిన ఆ ఉత్తరాల ఆధారంతో తానే దోషి అయినట్టు అతను ఇతరుల కద్ద నిరూపించవచ్చు. అవసరమైతే నిరూపించడానికి వెనుకాడడుకూడా. ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న పరిస్థితి ఏర్పడిందిప్పుడు.

ముందూ, వెనకా ఆలోచించకుండా ఏ పనైనా చేస్తే ఇలాగే జరుగుతుంది. తానిప్పుడు తిరిగి ఆపదల్లో ఇరుక్కోడానికి సిద్ధంగా ఉన్నాడు. నిశ్చింతగా ఉండగల పరిస్థితి

మళ్ళీ పోయింది. మళ్ళీ ఏవో విచారాలు, చింతలు, బాధలు తప్పవు.

ఒకసారి బాబాజీని కలుసుకుని ఆయన పరిస్థితి ఎలా ఉందో గమనిస్తే అనుకున్నాడు యమదూత. బాబాజీకి తన రహస్యం తెలియకుండా ఉంటే చాలా మంచిది. తాను పంపిన ఉత్తరాలు కట్టి ఆయనకు అందకుండా ఉన్నా మేలే.

యమదూత ఆలోచనల్లోంచి తేరుకుని ఒక నిర్ణయానికి రాకముందే గుహ ముందు నించి ఎవరివో అడుగుల చప్పుడు వినిపించింది. యమదూత వెంటనే తన అనుచరుల వంక చూశాడు. అందులో ఒకతను నెమ్మదిగా బయటికి నడిచాడు.

అతను కాసేపటికి లోపలికివచ్చి "మీకోసం బాబాజీ గారు ఏవో కబురంపారు," అన్నాడు యమదూతతో.

యమదూత ఆ మాట వినగానే ఆలోచనలన్నిటిని ఒక ప్రక్కకు నెట్టి యమదూత గుహలోంచి బయటికి వచ్చాడు. అక్కడ నిలబడి ఉన్న ఒక వ్యక్తివంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"మిమ్మల్ని బాబాజీ వెంటనే తన రహస్య భవనానికి రమ్మని చెప్పమన్నారు," అన్నాడా వ్యక్తి.

యమదూత ఆ వ్యక్తివంక పరిశీలించి చూశాడు. చూస్తే అతనేదో కంగారులో ఉన్నట్టనిపించింది.

"బాబాజీకేమీ అపాయం తటస్థించలేదుకదా?" అని అడిగాడు యమదూత.

"ఏదో జరిగినట్టే తోస్తోంది. ఆయనతో స్వయంగా మాట్లాడి మీరన్ని విషయాలూ తెలుసుకోవడం మంచిది. మీరు త్వరగా రావాలి. ఆయన మీకోసం ఎదురు చూస్తుంటారు," అన్నాడా వ్యక్తి జవాబుగా.

"సరే, నువ్వు పద. నేనిప్పుడే బయలుదేరి వస్తాను." అంటూ యమదూత మళ్ళీ గుహలో అడుగు పెట్టాడు.

ఆ వ్యక్తి వెనక్కి తిరిగి ప్రయాణం ప్రారంభించాడు. యమదూత దుస్తులు మార్చుకుని ప్రయాణానికి సిద్ధపడేసరికి ఎక్కువ సేపు కాలేదు. వెనక్కి తిరిగి వెళ్ళిన భటుడు కూడా ఎక్కువ దూరం వెళ్ళి ఉండడు.

యమదూత ఆతురతకొద్దీ గబగబా బాబాజీ రహస్య భవనం వైపు ప్రయాణం సాగించాడు. అతను వెళ్ళేసరికి బాబాజీ దిగాలుగా గదిలో మంచంమీద పడుకున్నాడు. యమదూత ఆయన నిదివరకెన్నడూ అలాంటి అధైర్య స్థితిలో చూడలేదు. ఇప్పుడాయన అలా ఉండడానికి కారణమేమిటో యమదూత కవగాహన కాలేదు.

యమదూత మనస్సు ఎందుకో లోలోపల భయపడుతూనే ఉంది. అతను తిన్నగా వెళ్ళి బాబాజీ దగ్గర నిలబడ్డాడు. బాబాజీ యమదూతను చూడగానే కూర్చోమని సంజ్ఞ చేసి తానుకూడా లేచి కూర్చున్నాడు.

"నేనే బయలుదేరి మీ దగ్గరికి వద్దామనుకుంటున్నాను. ఇంతలో మీ మనిషివచ్చి మీ కబురందించాడు," అన్నాడు యమదూత సంభాషణ కుపక్రమిస్తూ.

"ఔను. పరిస్థితులు ఆపకాడికి విషమిస్తున్నాయి. ఇంత బలవంతులైన శత్రువుల్ని నేనిదివరకు చూడలేదు. సమర సింహుడు ఎక్కడ బంధింపబడిందీ కూడా చివరికి నేను తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు మరో ఆపద వచ్చి పడింది." అన్నాడు విచారంగా బాబాజీ.

"ఏమిటది?" ఆతురతకొద్దీ ప్రశ్నించాడు యమదూత.

బాబాజీ ఒక్క క్షణం మాట్లాడలేదు. అనుకోకుండానే ఆయన గొంతు బొంగురు పోయింది. చివరికి హీనస్వరంలో అన్నాడు.

"ఈ రహస్య భవనాన్ని గురించి శత్రువులుకూడా తెలుసుకున్నారు. నేను లేని సమయంలో ఇక్కడికి వచ్చి మాలతిని బంధించి తీసుకుపోయారు."

"మాలతినా!" ఆశ్చర్యంగా అడిగాడు యమదూత. "మీ భటులు ఏం చేస్తున్నారు?"

"వాళ్లను ముందుగానే స్పృహ కోల్పోయేట్లు చేసి శత్రువులాపని చేశారు," అన్నాడు బాబాజీ.

మాలతిని బంధించింది సాధు ముఠాయే అయి ఉంటుందని యమదూత గ్రహించాడు. ముఖ్యంగా ఉత్తరాల పెట్టె కోసమే ఈ పని చేసి ఉండాలి.

యమదూత ఈ విషయాలేమీ పైకి చెప్పలేదు.

"మాలతిని బంధించాల్సిన అవసరం వాళ్ళకేం కలిగిందో!" అన్నాడు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ.

"అదే నాకూ తెలియడంలేదు," బాబాజీ ముక్తసరిగా దీనంగా అన్నాడు.

"భటులను స్పృహ కోల్పోయేట్టు చేసి వాళ్ళు మాలతిని ఎత్తుకుపోయారంటే ఇది ముందుగా పన్నిన పన్నాగమై ఉండాలని నా నమ్మకం." యమదూత మళ్ళీ అన్నాడు.

బాబాజీ తల ఊపాడు. ఏదో విచారం ఆయనను పూర్తిగా ఆవరించింది. యమదూతకూడా ఆయన విచార వదనాన్ని గమనించి కాసేపటివరకు ఏమీ మాట్లాడలేదు.

చివరికి బాబాజీ నెమ్మదిగా అన్నాడు.

"ఈ ముఠా విషయంలో నేను ఇంకింత శ్రద్ధ వహించా లనుకుంటున్నాను. మాలతిని ఎలాగైనా సరే విడిపించుకు రావాలి. అలా చెయ్యలేని పక్షంలో సన్యాసం పుచ్చుకోవ డం మంచిదని నా ఉద్దేశం."

బాబాజీ గొంతులో ఏదో ప్రతిధ్వనించింది. ఆ వెంటనే యమదూత అన్నాడు.

"ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్నది మంత్రి సాధు అని నాకు నమ్మకంగా తెలిసింది. మీకిదివరకే ఎన్నో సార్లు విషయం చెప్పాను. అయినా మీ రతని విషయంలో చాలా అశ్రద్ధ చూపిస్తున్నారు. అందుకే ఈ అపాయాలన్నీ తట స్థించడం!"

"ఇక ఎవరినీ వదలను. ఏమాత్రం అనుమానం ఉన్నా చెయ్యగలిగింది చేసి వదులుతాను," అన్నాడు బాబాజీ దృఢ నిశ్చయంతో.

యమదూత ఓసారి బాబాజీ వంక చూశాడు. ఇంతకు ముందు దీనంగా ఉన్న వదనం ఇప్పుడు చాలా గంభీరంగా

ఉంది. కరుణతో నిండి ఉండే ఆయన మనస్సు కఠినంగా మారినట్టుంది.

"తల్చుకుంటే బాబాజీ ఏమైనా చెయ్యగలడు," అను కున్నాడు యమదూత మరోసారి లోలోపల.

యమదూతకు ఒక్క బాబాజీ అంటే తప్ప మరెవరం టేనూ భయంలేదు. ఆయన తానెన్ని తప్పులు చేసినా ఇంత వరకూ క్షమిస్తూ వచ్చాడు.

"ఇప్పుడు నన్నేం చెయ్యమని ఆజ్ఞాపిస్తారు?" అన్నాడు యమదూత వినయపూర్వకంగా.

"ఆ సంగతి ముందే చెప్పాను. నాకు ముఖ్యంగా చెయ్య వలసిన సాయం మాలతిని ఎక్కడ బంధింపబడి ఉన్నా సరే విడిపించుకురావడం. ఇదొక్క పనీ చేస్తే చాలు?" అన్నాడు బాబాజీ ప్రార్థనాపూర్వకంగా.

యమదూత లేచి నిలబడ్డాడు.

"మీకీ సందర్భంలో సాయం చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆమె కోసం నాకు తెలిసిన అన్ని స్థలాలూ వెదకుతాను," అన్నాడు నిశ్చయపూర్వకంగా బాబాజీవంక చూస్తూ.

బాబాజీ మౌనం వహించి ఆలోచనలో పడ్డాడు. ఆయన ఏ మాలోచిస్తున్నదీ యమదూతకు తెలియలేదు.

"ఇక వస్తా," అంటూ నెమ్మదిగా బయటికి నడిచాడు యమదూత. బాబాజీ అంగీకారసూచకంగా తల ఊపాడు తప్ప ఏమీ మాట్లాడలేదు.

యమదూత గుహలోంచి బయటికి రాగానే రుద్రదేవుడు భవనంలో ప్రవేశించడానికి సిద్ధంగా ఉండడం చూశాడు.

బాబాజీ రుద్రదేవుడికి మామూలు రహస్యాలన్నీ చెప్పినా రణధీర్ సంగతి మాత్రం చెప్పలేదు. అందుచేత అతనికి యమదూత మీద రణధీర్ హత్య సందర్భంగా ఒక విధమైన అసహ్యభావం ఉండనే ఉంది.

మరోప్రక్క యమదూతకు కూడా రుద్రదేవుడి మీద కోపమే. చివరికి ఏమైలా జరిగినప్పటికీ తనకు చేసిన ప్రతిజ్ఞను పాటించలేక పోయాడు రుద్రదేవుడు. పైగా అందరి ఎదటా తన మీద నిందారోపణలు చేస్తూ ప్రచారం చేశాడు.

యమదూత రుద్రదేవుడిని చూశాడు కాని ఏమీ మాట్లాడలేదు. రుద్రదేవుడు కూడా యమదూతను పలకరించలేదు. యమదూత తిన్నగా ముందుకు సాగిపోయాడు. రుద్రదేవుడు బాబాజీ దగ్గరికి వెళ్ళాడు.

రుద్రదేవుడు గదిలోకి వెళ్ళేసరికి బాబాజీ ఇంకా అదే ఆలోచనలో మునిగి ఉన్నాడు. రుద్రదేవుడు తిన్నగా వెళ్ళి ఆయన కెదురుగా కూర్చున్నాడు. బాబాజీ అతనిని చూడగానే బాధగా నవ్వాడు.

"యమదూత ఇక్కడికి వచ్చి వెళ్ళినట్టున్నాడు," అన్నాడు రుద్రదేవుడు.

"ఔను. నేనే అతనిని రప్పించాను. మాలతి విషయం అతనితో చెప్పడంకోసం పిలిపించాను," బాబాజీ అన్నాడు.

రుద్రదేవుడు ఒక్క నిమిషం మౌనం వహించాడు.

"మీరు అనవసరంగా యమదూతమీద నమ్మకముంచుతున్నారు. అతను చాలా అపాయకారి అన్న విషయాం మర్చిపోయి అన్ని రహస్యాలు అతనికి చెబుతున్నారు. ఇదొక్కటే నాకు చాలా బాధ కలిగించే విషయం," అన్నాడు రుద్రదేవుడు కఠినంగా.

బాబాజీ మళ్ళీ [illegible]హాసం చేశాడు.

''యమదూతను నువ్వింతగా ద్వేషించడం తగదు. అతడు స్వతహాగా మంచివాడు. పరిస్థితు లతనిని చెడ్డవాడినిగా చేసినా మంచివాడుగా మారడాని కవకాశాలున్నాయి."

"నాకేమీ నమ్మకంలేదు. తన యజమానినే సంహరించిన ద్రోహి ఇతరులకు ద్రోహం తలపెట్టడన్న నమ్మకమేమిటి?" మరింత కఠినంగా అన్నాడు రుద్రదేవుడు.

బాబాజీ ఒక్కసారి నిట్టూర్చాడు.

"సరే, ఈ విషయాలన్నీ అప్రస్తుతం. యమదూత చేస్తే మనకు మేలు చెయ్యాలిగాని, అపకారం చేద్దామనుకున్నా చెయ్యలేడు," అన్నాడు.

రుద్రదేవుడు మాట్లాడలేదు. బాబాజీకి వ్యతిరేకంగా ఏ విషయాలైనా మాట్లాడడం అనవసరం. ఆయన ఎవరి విషయంలోనైనా సరే, బాగా ఆలోచించి కాని ఒక నిర్ణయానికి రాడు.

"ఇక్కడ మాలతి ఉంది కాబట్టి రోజూ కాకపోయినా మూడు రోజుల కొకసారైనా ఇక్కడికి వస్తున్నాం. ఇక మన కిలాంటి స్థావరమూ అక్కరలేదు. మన ప్రయత్నాలలో మనం ముందుకు సాగిపోదాం. ఆ ముఠాను కను

కున్నాని, వాళ్ళ ఘాతుక చర్యల్ని అరికట్టాలి," అన్నాడు బాబాజీ.

"నేనందుకు ఎప్పుడూ సిద్ధమే," అన్నాడు రుద్రదేవుడు.

"వెంటనే బయలుదేరదామా ?" బాబాజీ ప్రశ్నించాడు.

రుద్రదేవుడు అంగీకారసూచకంగా తల పంకించాడు. బాబాజీ వెంటనే ఒక భటుడిని పిలిచి తమ ప్రయాణానికి కావలసిన పరికరాలనన్నిటిని సిద్ధం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

భవానీపురంలోను, భూగృహంలోను ఉండి మనం మన పనులు కొనసాగిద్దాం." అన్నాడు రుద్రదేవుడు.

"అలాగే," బాబాజీ ముక్తసరిగా సమాధానమిచ్చాడు. ఇద్దరూ భవనంలోంచి బయటపడి తిన్నగా భవానీపురం వైపు ప్రయాణం ప్రారంభించారు. భవనంలోంచి బయటికి రాగానే బాబాజీ ఒకసారి బాధగా మూల్గాడు.

## 3

వికృతంగా ఉన్న ఒక వ్యక్తి కొండలబారుకు దగ్గర్లో ఉన్న అడవిలోని ఒక చెట్టుక్రింద కూర్చుని ఉన్నాడు. చూడడాని కతని ఆకారం చాలా భయంకరంగా ఉంది. కళ్లు ఎరుపెక్కి ఉన్నాయి. పెద్ద పెద్ద మీసాలు, గడ్డం. మొఖాన విభూతి రేఖలు.

చుట్టూ నిశ్శబ్దంగా ఉంది. చీకటి పడడానికి ఇంకా ఎక్కువసేపు పట్టదు. ఆకాశం స్వచ్ఛంగా ఉంది. వర్షం వచ్చే సూచన లేమాత్రం లేవు.

ఆ వ్యక్తి నెమ్మదిగా చుట్టూ చూశాడు. అన్నివైపులా వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఏ విధమైన ధ్వనీ ఎటునించీ వినరావడంలేదు. అతను మాత్రం ఎవరికోసమో ఎదురు చూస్తూ కూర్చున్నట్టున్నాడు.

అకస్మాత్తుగా ఎక్కడినించో ఒక ఈల వినిపించింది. వెంటనే చెట్టుక్రింద కూర్చున్న వ్యక్తి ఆ ఈలకు జవాబుగా మళ్ళీ ఈలవేశాడు. తర్వాత ఆ ఈల వచ్చిన వైపు చూస్తూ కూర్చున్నాడు.

కొంతసేపటికి ఒక వ్యక్తి అతని దగ్గరికి వచ్చి నమస్కారం చేశాడు.

"ఏమిటి సంగతులు ?" అతని కంఠం ఖంగుమంది.

అతనికి దగ్గరగా కూర్చుని ఆ వచ్చిన వ్యక్తి నెమ్మదిగా చెప్పాడు.

"వాళ్ళు బయలుదేరారు. ఇటే వస్తున్నారు. మీకు చెప్పడానికి నేను ముందుగా వచ్చాను."

"వాళ్ళిక్కడికి రావడానికి ఎంతసేపు పడుతుంది ?" మొదటి వ్యక్తి అడిగాడు.

"ఎక్కువసేపు పట్టదు. ఈపాటికి చాలాదూరం వచ్చేసి ఉంటారు. దారిలో ఎక్కడైనా ఆగిపోతే తప్ప లేకపోతే ఒక పావుగంటలో మైదానంలో ప్రవేశించవచ్చు," అన్నాడు రెండవ వ్యక్తి.

"సరే, నువ్వు వెళ్ళిపో," అని ఆజ్ఞాపించి మొదటి వ్యక్తి అటూ ఇటూ చూశాడు.

వచ్చిన మనిషి వెళ్ళిపోగానే భయంకరంగా ఉన్న ఆ వ్యక్తి దగ్గర్లోనే ఉన్న చాలా ఎత్తయిన చెట్టుమీది కెక్కాడు. చివరికొమ్మమీదికి ఎక్కి అన్ని వైపులా పరికించి చూశాడు.

అడవిలోంచి వెళ్ళిపోతున్న తమ వ్యక్తి కనిపించాడతనికి. కాని వస్తారనుకుంటున్న వ్యక్తులెవరూ కనబడలేదు. అతని చూపులు వెంటనే కొండలబారు వైపు తిరిగాయి.

కొండలబారు స్పష్టంగా కనిపిస్తోంది. మొదటినించి చివరి దాకా అన్ని గుహాలూ కొంచెమో గొప్పో అగుపిస్తూనే ఉన్నాయి. అతనోసారి సంతృప్తిగా గాలి పీల్చి అక్కడే కూర్చున్నాడు.

చాలసేపు గడచింది ఇద్దరు వ్యక్తులు అడవిలోంచి మైదానంలో అడుగు పెట్టారు. ఇద్దరి మొఖాలమీద ముసుగులున్నాయి. ఇద్దరూ మైదానంలో ప్రవేశించగానే ఓసారి అన్ని ప్రక్కలా కలయచూశారు.

అప్పటికి చీకటి అన్నిప్రక్కలా అలముకుంది. నిశ్శబ్దం మరింత హెచ్చింది. చెట్టుపైనున్న వ్యక్తి చూపులు ఆ ఇద్దరు ముసుగు వ్యక్తుల మీదికి తిరిగాయి. అతను కొంచెం ఆశ్చర్యంగా పరీక్షగా అటే చూడసాగాడు.

ముసుగువ్యక్తులిద్దరూ పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ మైదానంలో ముందుకు సాగిపోయారు. కొండలబారును సమీపించి దాని వెంబడే ముందుకు నడిచారు. అలా చాల దూరం వెళ్ళిన తర్వాత ఆ ఇద్దరూ ఒక గుహాలో అడుగు పెట్టారు.

ఇదంతా చూస్తూనే ఉన్నాడు చెట్టుపై వ్యక్తి. అతను పైనుంచే వాళ్లు ప్రవేశించిన గుహ చుట్టుప్రక్కల బాగా పరీక్షించి చూశాడు. ఆ గుహను బాగా గుర్తుపెట్టుకున్నాడు.

నెమ్మదిగా చెట్టుమీదినించి దిగి కొంసేపక్కడ ఆగాడు. ఏదో విషయం బాగా ఆలోచించి చివరి కొక నిర్ణయానికి వచ్చినట్టున్నాడు.

అక్కడినించి మైదానంలో ప్రవేశించి అతను కూడా వాళ్ళు వెళ్ళిన దారినే ముందుకు సాగాడు. అలా కొంత దూరం కొండలబారు వెంబడి వెళ్ళింతర్వాత ఒక గుహ దగ్గర ఆగి చుట్టుప్రక్కల జాగ్రత్తగా పరీక్షించి చూశాడు.

ఒకసారి తనలో తానే నవ్వుకుని తల ఊపుకుంటూ అతనాగుహలో ప్రవేశించాడు. గుహ చాలా పెద్దది. లోపలికి వెళ్ళినకొద్దీ భయంకరమైన చీకటి ఆవరించి ఉంది.

అతనొక చోట ఆగి చీకట్లో ముందుకు చూశాడు. కాని కంటికేమీ కనిపించలేదు. కొంచెం ప్రక్కగా జరిగి తన దుస్తుల్లోంచి కొవ్వొత్తిని తీసి వెలిగించాడతను. అకస్మాత్తుగా వెలుగు గుహ నావరించడంతో ఒక్క క్షణం అతని కళ్ళు మూసుకుపోయాయి. తర్వాత అతను వెలుగులో ముందుకు సాగిపోయాడు. గుహలో ఎలాంటి వస్తువులూ అతనికి కనిపించలేదు.

గుహ చివరిదాకా వెళ్ళి అతను పరీక్షగా అన్ని మూలలా చూశాడు. ఒక ప్రక్కగా ఏదో పగులు ఉన్నట్టు కనిపించింది. అదే సొరంగ మార్గానికి ద్వారమై ఉంటుందను

కున్నాడతను. ఈ సొరంగ మార్గం ఎక్కడికి వెళ్తుందో, లోపలికి వెళ్ళడమా, వద్దా అని ఒక్క క్షణం తటపటా యించాడతను. కాని మొండి ధైర్యంతో ముందుకే సాగి పోదామని నిశ్చయించుకున్నాడు.

ఆ ద్వారాన్ని తెరచి అతను సొరంగ మార్గంలో అడుగు పెట్టాడు. తలుపు మళ్లీ మూసేసి ముందుకు సాగాడు. చేతిలో కొవ్వొత్తి ఇంకా వెలుగుతూనే ఉంది. దాని కాంతి అన్నిప్రక్కలా ప్రసరిస్తూనే ఉంది.

సొరంగం సమాప్తమైంది. దాని చివర ఉన్న ద్వారం వంక ఆ భయంకర వ్యక్తి కళ్ళుప్పగించి చూశాడు. దానిని తెరవడానికి గల సాధనమేమిటో క్షణకాలంవరకు అతని కవగాహన కాలేదు. ఆలోచిస్తూ అక్కడే నిలబడ్డాడు.

అకస్మాత్తుగా అతని చూపులు తలుపు క్రింది భాగంమీద పడ్డాయి. పైన ఉండడానికి బదులుగా చిన్న గొళ్ళెం తలుపు క్రింది భాగాన తగిలించబడి ఉంది. అతను ఆనందంగా దానివంక చూసి తర్వాత తన చేతిలోని క్రొవ్వొత్తిని ఆర్పి వేశాడు.

నెమ్మదిగా గొళ్ళెం ప్రక్కకు నెట్టాడు. తలుపు తెరిచాడు. అకస్మాత్తుగా వెలుగు అతనిమీదకి ప్రసరించింది. అవతలి వైపున ఉన్న భటుడు ఆశ్చర్యంగా ఆ భయంకరమైన వ్యక్తి వంక చూశాడు. అతనిని అడ్డగించడానికి ప్రయత్నించాడు.

ఆ వ్యక్తి భటుడి భుజంమీద చెయ్యివేసి వికటాట్ట హాసం చేశాడు.

"నేను మీకు సంబంధించిన వ్యక్తినే. మారువేషంలో ఉన్నాను. మంత్రి సాధు, బికారి ఎక్కడ ఉన్నారు?" అని ప్రశ్నించాడు గంభీరంగా.

భటుడతనివంక పరీక్షగా చూశాడు. కాని గుర్తుపట్టలేక పోయాడు.

"ముందు నువ్వెవరివో చెప్పు," అన్నాడు భటుడు గర్జిస్తూ.

"ఆ సంగతి ముందే చెప్పాను. నేను మంత్రిసాధుకు సంబంధించిన వాడిని. లేకపోతే ఈ స్థావరం విషయం నా కెలా తెలుస్తుంది," అన్నాడా వ్యక్తి నవ్వుతూ.

"కాని నిన్ను నే నెక్కడా చూడలేదే?" అన్నాడు భటుడు సందేహంగా.

అతను మళ్లీ వికటంగా నవ్వాడు.

"నేను మారువేషంలో ఉన్నానని ముందుగానే చెప్పాను. నన్ను మారువేషంలో పోల్చుకోవడం నీకే కాదు, మంత్రిగారి కూడా సాధ్యంకాదు."

"పోనీ పేరు చెప్పకూడదూ?" భటుడన్నాడు.

"గూఢచారులకి ఒక పేరని ఏమిటి? రోజు కొక పేరు మారుతుంది. ఏ పేరు చెప్పమంటావు!" అతను మళ్ళీ నవ్వుతూ అన్నాడు.

ఆ వ్యక్తి ఎంత చెప్పినా భటుడికి నమ్మకం కలగలేదు.

"నువ్వు నన్ను లోపలికి వెళ్లనివ్వకపోతే బలవంతం చెయ్యవలసి వస్తుంది," అన్నాడా వ్యక్తి కోపంగా.

"నువ్వెవరో నికరంగా తెలియంది నేను నిన్ను లోపలికి వెళ్ళనివ్వను," అన్నాడు భటుడు నిర్భయంగా.

వాదోపవాదాలతో మరి కాసేపు గడచింది. ఇంతలో అవతలివైపునించి తలుపు తెరచుకుని బికారి ఇవతలికి వచ్చాడు. భయంకరంగా ఉన్న ఒక వ్యక్తిని ఆ గదిలో చూడగానే అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. ఆశ్చర్యంతో పాటు ఆందోళనకూడా అతని నావరించింది.

బికారిని చూడగానే ఆ వ్యక్తి భటుడివంక చూడకుండా నవ్వుతూ బికారివైపు నడిచాడు.

"మీ భటుడు అనవసరంగా ఇందాకటినించి నన్నిక్కడ నిలబెట్టాడు," అన్నాడు వ్యంగ్యంగా బికారితో.

తన నుద్దేశించి మాట్లాడుతున్న ఆ వ్యక్తి ఎవరో బికారికి తెలియలేదు. తిన్నగా బికారితోనే మాట్లాడుతూ ఆ వ్యక్తి ముందుకు సాగడంవల్ల భటుడతని నడ్డగించలేదు. బికారి వింతగా అతని వంక చూస్తూ నిలబడిపోయాడు.

"క్షమించాలి. నేను నిన్ను గుర్తుపట్టలేదు." ఈ మాట బికారి అన్నాడేకాని అతని మనస్సు కంగారుపడుతోంది.

ఈ స్థావరం విషయం తనకు, మంత్రికి, అక్కడ కాపుండే నమ్మకమైన భటుడికి తప్ప మరెవరికీ తెలియదు. ఇతరుల నెవరినైనా తీసుకువచ్చినా, తీసుకు వెళ్ళినా వాళ్ల కళ్లకు గంతలు కట్టాల్సిందే. తమ ముఖ్యానుచరులకు కూడా ఈ స్థావరం విషయం తెలియదు.

అలాంటిది, ఈ వ్యక్తి ఎవరు? ఇక్కడి క్రైలా రాగలి గాడు? ఈ స్థావరం విషయం అతని కెలా తెలిసింది? అసలెందుకు వచ్చాడు?

రకరకాల ప్రశ్నలు, అనుమానాలు, సందేహాలు బికారి మనస్సు నావరించి మరింత కంగారు పెట్టసాగాయి.

ఆ వ్యక్తి నోరు విప్పాడు.

"నువ్వు కూడా నన్ను గుర్తుపట్టలేదన్నమాట. నేననుకుంటూనే ఉన్నాను. అలాగే జరిగింది. సరే, ఇంతకూ మంత్రిగారెక్కడ? ఆయనతో అవసరంగా మాట్లాడాల్సిన విషయాలున్నాయి. అత్యవసరమైన విషయాలు."

బికారి కేమీ తోచలేదు. అతనెవరో తెలియదు. మంత్రిగారితో ముఖ్య విషయాలు మాట్లాడాలంటున్నాడు. ఇప్పుడేం చెయ్యాలి?

"మంత్రిగారిప్పుడిక్కడలేరు. ఆయనతో మాట్లాడవలసిన విషయాలేమిటో అత్యవసరమైనవైతే నాతో చెప్పవచ్చు," అన్నాడు ఆలోచిస్తూనే చివరికి బికారి.

ఆ వ్యక్తి మళ్ళీ బిగ్గరగా నవ్వాడు. ఆ నవ్వు గదిలో ప్రతిధ్వనించింది.

"నీ అబద్ధాలన్నీ నా దగ్గర సాగవు. మంత్రి సాధు, నువ్వు కలసి ఇక్కడికి రావడం నేను కళ్ళారా చూశాను. అలాంటప్పుడు మంత్రి ఇక్కడ లేడని దబాయిస్తే ఎలా?"

బికారి ఈ మాట వినగానే మరింత కంగారు పడ్డాడు. ఇక తానేమనడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది.

ఆ వ్యక్తి అట్టహాసం విన్న మంత్రి సాధు కూడా అక్క డికి వచ్చి ఆ వ్యక్తిని చూడగానే కంగారుపడిపోయాడు. ఏదో తెలియని భయం అతనిని పూర్తిగా ఆవరించింది.

మంత్రిని చూడగానే ఆ వ్యక్తి మందహాసం చేశాడు.

"మీకోసమే ఇంతదూరం పని కట్టుకు వచ్చాను. మీతో మాట్లాడవలసిన విషయాలున్నాయి," అన్నాడు నెమ్మదిగా.

"ఇంతకూ అసలు నువ్వెవరో నేను గుర్తుపట్టలేక పోయాను," అన్నాడు మంత్రి.

"మీ రేకాదు, ఎవరూ నన్ను మారువేషంలో గుర్తుపట్ట లేరు," అన్నాడు ఎగతాళిగా ఆ వ్యక్తి.

"ముఖ్యవిషయాలేవో మాట్లాడే ముందు నువ్వెవరో చెప్పడం అవసరం కాదూ?" అన్నాడు మంత్రి.

మంత్రి ఏదో మాట్లాడుతున్నాడే కాని అతని గుండెలు భయంతో కొట్టుకుంటున్నాయి. తన వృత్తాంతం, తన స్థావరం విషయం ఇతరులకి తెలిసిందంటే—ఇక తాను ప్రాణాలమీద ఆశ వదులుకోవలసిందేనన్నమాట.

ఆ వ్యక్తి దగ్గర్లోనే ఉన్న ఒక ఆసనంమీద తాపీగా కూర్చున్నాడు.

"మీరు కూడా కూర్చోండి. నన్ను గురించి అనవస రంగా కంగారు పడకండి. అన్ని విషయాలూ నిదానంగా మాట్లాడుకుందాం," అన్నాడు.

మంత్రిసాధు కూడా ఆ వ్యక్తికి ఎదురుగా ఉన్న ఆసనం మీద కూర్చున్నాడు. భికారి అతని ప్రక్కనే ఆసీను డయ్యాడు. క్షణకాలం గదిలో నిశ్శబ్దం ఆవరించింది.

## 4

జోడు గుర్రాలు వేగంగా ముందుకు సాగిపోతున్నాయి. అప్పుడే చీకటి పడింది. చీకటిలో ఆకారాలు అంత స్పష్టంగా తెలియడంలేదు. దట్టంగా పెరిగిన చెట్ల సందుగా గుర్రాలు పరుగిడుతున్నాయి.

ముందు గుర్రం మీద ప్రయాణం చేస్తున్నది రణధీర్, అతని వెనుక గుర్రం మీద ఉన్నది అతని భార్య రుక్మిణి.

బాబాజీ భవనంలోంచి వేరుపడి ఒక రహస్య స్థలంలో తలదాచుకుంటున్న రణధీర్, రుక్మిణి మారువేషాలలో బాబాజీకి సాయంచేసే నిమిత్తం బయలుదేరారు.

మాలతిని ఎవరో ఎత్తుకుపోయారన్న వార్త విన్న రుక్మిణి చాలా బాధపడింది. ఆమె తనకెంతో ఆప్తురాలు. చాలా సాయం చేసింది. ఆమెను విడిపించే బాధ్యత తప్పకుండా తన తలపై వేసుకోవాలనుకుంది రుక్మిణి. ఇద్దరూ బాబాజీని కలుసుకోడానికి గుర్రాలమీద బయలుదేరారు.

అకస్మాత్తుగా నాలుగైదు గుర్రాలు వాళ్ళ కెదురు వచ్చాయి. ఆ గుర్రాలమీద ఉన్న వాళ్ళ చేతుల్లో కాగడాలు కూడా ఉన్నాయి. ఆ కాగడాల కాంతి అడవి అంతటినీ ఆవరించి ఉన్న చీకటిని పారద్రోలింది.

రణధీర్ తన గుర్రాన్ని ఆపాడు. రుక్మిణి కూడా ఆగిపోక తప్పలేదు. ఎదురు వచ్చిన నాలుగైదు గుర్రాలు వాళ్ళను చుట్టు ముట్టాయి. తప్పించుకోడాని కెక్కడా అస్కారం లేదు.

"ఎవరు మీరు? మమ్మల్నెందుకు చుట్టుముట్టారు?" మారువేషంలో ఉన్న రణధీర్ గర్జించాడు.

"ముందు మీ రెవరో చెప్పండి. ఎక్కడినించి వస్తున్నారో, ఎక్కడికి వెళ్తున్నారో తెలియచెయ్యాలి," ఆ రౌతులలో మొదటివాడన్నాడు.

"ఈ సంగతులన్నీ మీకు చెప్పాల్సిన అవసరంలేదు," రణధీర్ మళ్ళీ బిగ్గరగా అన్నాడు

"అయితే మీరిద్దరూ ఎవరో మేం బలవంతాన తెలుసుకోవలసి వస్తుంది," అన్నాడా వ్యక్తి మళ్లీ.

రణధీర్ మరుక్షణంలో పట్టరాని కోపంతో కత్తిదూశాడు. క్షణంలో ప్రశాంత వాతావరణంలో కల్లోలం చెలరేగింది. రౌతులు నలుగురైదుగురూ కత్తులు దూసి రణధీర్ మీద, రుక్మిణిమీద తిరగబడ్డారు.

అయితే ఆ యుద్ధం ఎక్కువసేపు కొనసాగలేదు. అకస్మాత్తుగా వాళ్ళ మధ్యగా గుప్పున పొగ లేచింది. మరి కాసేపటికి రణధీర్, రుక్మిణితోపాటు రౌతుల నాయకుడు తప్ప మిగిలిన అందరూ స్పృహ కోల్పోయారు.

అతను వెంటనే తన దగ్గర ఉన్న ఏదో మందును తన అనుచరులకు వాసన చూపించాడు. కాసేపటిలో వాళ్ళు లేచి కూర్చున్నారు. తమ ప్రక్కనే స్పృహ కోల్పోయి

పడి ఉన్న శత్రువులనిద్దరినీ చూడగానే వాళ్ళకు ఆశ్చర్యం కలిగింది. ఒకసారి తమ నాయకుడి వంక విచిత్రంగా చూశారు.

అతను తన అనుచరుల వంక చూసి మందహాసం చేశాడు.

"ముందు వీళ్ళిద్దరూ ఎవరో తెలుసుకోవాలి. మారు వేషాలలో ఉన్నట్టున్నారు," అన్నాడు.

"మన దగ్గర ఉన్న నీటితో వీళ్ల ముఖాలు కడిగి చూస్తే తెలుస్తుంది," అన్నాడు అనుయాయులలో ఒకతను.

వాళ్ళందుకు పూనుకునే సమయానికి దగ్గరలోంచే గుర్రాలు తమ వైపు వస్తున్న చప్పుడు వాళ్ళకు వినిపించింది. చప్పుడు వినగానే వాళ్ళందరూ తమ పని మాని నాయకుని అనుమతి మీద రణధీర్‌ను, రుక్మిణిని తమ గుర్రాల మీద వేసుకుని ప్రక్కకు తిరిగి అడవిలోకి వెళ్ళిపోయారు.

ఎక్కువసేపు కాలేదు. రెండు గుర్రాలు అదే దారిని వేగంగా వచ్చాయి. అందులో ఒకదానిమీద బాబాజీ, రెండోదానిమీద రుద్రదేవుడు ఉన్నారు.

రణధీర్, రుక్మిణి ఎక్కి వచ్చిన గుర్రాలు అక్కడే ఉండి పోయాయి. వాటిని చూడగానే బాబాజీ తన గుర్రాన్ని టక్కున ఆపాడు. అక్కడ నిలబడి ఉన్న రెండు గుర్రాలు ఆయన దృష్టిని బాగా ఆకర్షించాయి. అవి రెండూ తాను రణధీర్‌కు బహూకరించిన గుర్రాలని బాబాజీ గుర్తించ గలిగాడు.

"ఎందుకిక్కడ ఆగావు?" రుద్రదేవుడు ఆశ్చర్యంగా బాబాజీ నడిగాడు.

బాబాజీ ఆ రెండు గుర్రాలవంకా చూపించాడు.

వాటిని చూస్తే నాకొక సందేహం కలుగుతోంది. ఆ గుర్రాలు రెండూ రుక్మిణికి నేను బహూకరించినవి. వాటి నిప్పుడు ఇక్కడ ఒంటరిగా చూస్తే రుక్మిణి కేమీ అపాయం సంభవించలేదుకదా అనిపిస్తోంది నాకు," అన్నాడు క్షీణ స్వరంలో.

రుద్రదేవుడు గుర్రంమీదినించి దిగాడు. ఆ రెండు గుర్రాల దగ్గరికీ వెళ్ళి రెండు ప్రక్కలా కలయచూశాడు.

"చూస్తే ఇక్కడెవరికో పోరాటం జరిగినట్టనిపిస్తోంది రక్తపు గుర్తులుకూడా ఉన్నాయి," అన్నాడు రుద్రదేవుడు.

బాబాజీ కూడా గుర్రంమీదినించి దిగి రుద్రదేవుడి దగ్గరికి వెళ్ళాడు. అటూ ఇటూ పరికించి చూశాడు.

"ఔను. నువ్వు చెప్పింది నిజమే. ఆ పోరాటం కొద్ది సమయం క్రితమే జరిగి ఉండాలి," అంటూ బాబాజీ అరణ్యంలో నలువైపులకీ తన చూపులు పోనిచ్చాడు. కాని ఎక్కడా ఎవరూ కనిపించలేదు. రుద్రదేవుడి చూపులు కూడా అన్ని ప్రక్కలకూ పరుగెత్తాయి కాని అతని కంటికి కూడా ఎవరూ అగుపడలేదు.

"పాపం రుక్మిణి ఎవరిపాల పడిందో!" అన్నాడు విచారాన్ని సూచించే కంఠంతో బాబాజీ.

"ఆమెను యమదూతగాని, అతని అనుచరులుగాని బంధించి ఉండాలి," అన్నాడు రుద్రదేవుడు.

యమదూత మీద రుద్రదేవుడికున్న అనుమానాన్ని, ద్వేషాన్ని చూస్తే బాబాజీకి ఆశ్చర్యం కలిగింది. యమదూత ద్వారా ఈ పని జరిగి ఉండదని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నాడు.

రుద్రదేవుడు ఏదో అనుమానం వచ్చినట్టు వెంటనే అడిగాడు.

"ఇక్కడ రెండు గుర్రాలున్నాయి. ఒకదానిమీద రుక్మిణి వచ్చిందనుకున్నా, రెండో గుర్రం మీద ఎవరు వచ్చి ఉంటారు?"

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. బహుశా ఆమె సహాయకురాలై ఉండవచ్చు," అన్నాడు బాబాజీ సమాధానంగా.

ఆయన అలా సమాధానమిచ్చాడేకాని రెండో గుర్రం మీద వచ్చింది రణధీర్ అయి ఉంటాడని ముందుగానే ఊహించుకున్నాడు. రణధీర్, రుక్మిణి మళ్ళీ శత్రువుల చేతుల్లో చిక్కారన్న తలంపు కలగగానే బాబాజీ శరీరం కంపించింది.

పాపం వాళ్ళిద్దరూ అంతులేని కష్టాలననుభవించారు. ఈ నాటివరకూ వాళ్ళింకా ఆ కలతనుండి తేరుకోనేలేదు. మళ్లీ ఏదో ఉపద్రవం వచ్చిపడింది. ఒకోసారి దురదృష్ట దేవత ఇలాగే కనికరిస్తుంటుంది!

బాబాజీ మనస్సులో రకరకాల ఆలోచనలు, ఆవేదనలు చెలరేగాయి. శత్రువులెవరోగాని చాలా బలవంతులై

ఉండాలి. తానింతవరకూ ఎవరి దగ్గరా ఓటమిని అంగీకరించ లేదు.

ఇప్పుడు అన్నీ అవాంతరాలే తన నెదురుక్కొంటున్నాయి. శత్రువులు ప్రతి పనిలోను దిగ్విజయం పొందుతున్నారు. సమరసింహుడి జాడ తెలియలేదు. మాలతి అపహరించ బడింది. ఇప్పుడు రణధీర్, రుక్మిణికూడా శత్రువుల చేతిలో చిక్కినట్టే లెక్క.

ఇంతమంది అప్తులు బాధలనుభవిస్తున్నారు. తానేమీ చెయ్యలేని స్థితిలో ఉన్నాడు. ఇందుకు కారణమేమిటి? అందరూ అంటున్నట్టు దుర్మార్గుల్ని గుర్తించకుండా వాళ్ళతో స్నేహం చెయ్యడమే కావచ్చు. వాళ్ళ మాటలు నమ్మడమే కావచ్చు.

బాబాజీ మనస్సు పరిపరి విధాల పోతోంది. ఆయన కిప్పుడేం చెయ్యడానికీ తోచడంలేదు.

రుద్రదేవుడితో సహా బాబాజీ రఘువీర్ మహారాజును కలుసుకోడానికి బయలుదేరాడు. అదే సమయంలో ఓసారి మంత్రిసాధును కూడా చూసి రావాలని ఆయన ఉద్దేశిం చాడు. మంత్రిని గురించి చాల మంది చెబుతున్న విషయాలు నిజమా, లేదా అన్న సందేహం నిరంతరం ఆయన్ని పీడిస్తోంది. ఆ విషయం రుజువుచేసుకోడానికి తన కిప్పుడూ ఎలాంటి అవకాశమూ లభించలేదు.

బాబాజీ రుద్రదేవుడి వంక చూశాడు. బాబాజీ ఏదో ఆలోచనలో మునిగిపోయి ఉన్నాడని గ్రహించగానే రుద్ర

దేవుడు మౌనం వహించి తాను కూడా ఏదో ఆలోచనలో మునిగిపోయాడు.

బాబాజీయే కాదు, తాను కూడా ఈ మధ్య ఏ పనిలోను విజయాన్ని సాధించలేదు. పూనుకున్న పనులేవీ కొనసాగడం లేదు. చెయ్యి పెట్టిన ప్రతి పనిలోను విజయాన్ని సాధించ గలిగిన తాను సమరసింహుడి జాడ తెలుసుకోవడంకోసం ఎంతగానో ప్రయత్నించి విఫలుడయ్యాడు.

ఇతరుల సంగతు లెలా ఉన్నా ఇప్పుడు తమ మీదకే ఆపదలు ముంచుకు వస్తున్నాయి. ఒకప్పుడు ఇతరులకు సాయం చెయ్యడానికి పూనుకునే తాము ఇప్పుడు స్వరక్ష ణార్థం పాటుపడవలసి వస్తోంది.

బాబాజీ కుమార్తె మాలతి అపహరింపబడినప్పటినుండీ ఎవరికీ నిద్రాహారాలు లేవు. ఆ పని చేసిందెవరో ఎవరికీ తెలియదు. బాబాజీ స్వయంగా ఎవరికీ శత్రువుకాదు. అలాంటప్పుడు ఆయన కుమార్తె నపహరించవలసిన అవసరం ఎవరికి కలిగినట్టు!

రుద్రదేవుడు ఆలోచనలో మునిగి ఉండగా బాబాజీ గొంతు వినిపించింది.

"సరే, వెళ్దాం పద. ఇక్కడ నిలబడిమాత్రం ప్రయోజన మేముంది? తర్వాత రుక్మిణి సంగతి ఆలోచించవచ్చు," అన్నాడు బాబాజీ.

ఇద్దరూ మళ్ళీ తమతమ గుర్రాలనెక్కి భూగృహంవైపు వేగంగా సాగిపోయారు.

# 5

మనస్సులో చాలా కంగారుపడుతున్న మంత్రి సాధు కూర్చోగానే ఆ వ్యక్తి వంక భయభయంగా చూస్తూ అన్నాడు.

"అసలు నువ్వెవరివో తెలియడంలేదు. ఇక్కడికి ఎలా రాగలిగావో అంతకంటే తెలియలేదు. నీకేం కావాలో చెప్పు. ఏ విషయాలు మాట్లాడడానికి వచ్చావో తెలియ చేస్తే సంతోషిస్తాను."

ఆ భయంకర వ్యక్తి మందహాసం చేస్తూ ఓసారి మంత్రి వంక వింతగా చూసి అన్నాడు.

"నేనెవరినో తర్వాత మీకే తెలుస్తుంది. ముందు నే నడిగే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసిందిగా కోరుతున్నాను."

"ఏం కావాలో అడుగు."

"మొదటి ప్రశ్న. ఈ స్థావరానికి అధిపతి మీరేకదూ?"

ఈ ప్రశ్న విన్న సాధుకు ఏం జవాబు చెప్పాలో వెంటనే తోచలేదు. ప్రక్కనే కూర్చుని ఉన్న బికారిమీదకి అతని చూపులు తిరిగాయి.

"ఈ స్థలానికి అధిపతులం మేమే," అన్నాడు బికారి సాధుకు బదులుగా సమాధానమిస్తూ.

"అయితే ఈ స్థావరానికి సంబంధించిన వాళ్ళు చేసిన కొన్ని ఘోరకృత్యాలు నాకు తెలుసు. అవి చేసినట్టుగా మీ రంగీకరిస్తారా?" ఆ వ్యక్తి అడిగాడు.

"మేమేమీ చెయ్యలేదు. ఇది మేం కులాసాగా కాలం గడపడానికి ఏర్పాటుచేసుకున్న స్థలంకాని, ఇతరత్రా కాదు. ఇందులోని వ్యక్తులం మేం ముగ్గురమే. మేం ఘోరకృత్యాలు చెయ్యగలిగినంత సమర్థులమూ కాదు. చేసేరకం మనుష్యులమూ కాదు," సమాధాన మిచ్చాడు వెంటనే మంత్రి.

ఆ వ్యక్తి బిగ్గరగా నవ్వాడు.

"పోనీ ఆ ఘోరకృత్యాలేమేమిటో మీరు తెలుసుకుంటే నష్టమేమీ లేదుగా. వరుసనే చెబుతాను వినండి."

"వాటిని గురించి ఏమీ చెప్పనక్కరలేదు. అవి మాకూ తెలుసు. ఆ విషయాలను గురించి ఆలోచించడానికే మేమిక్కడ రహస్య స్థావర మేర్పరచుకున్నాం," సాధు అన్నాడు.

ఆ వ్యక్తి వికటంగా నవ్వుతూ సాధు వంక చూశాడు.

"పోనీ అవేమిటో నాకు చెప్పండి. నేను వింటాను," అన్నాడు.

సాధుగాని బికారిగాని వెంటనే ఏమీ సమాధాన మివ్వలేదు. ఆ వ్యక్తి మళ్ళీ చెప్పనారంభించాడు.

"మీరు నా దగ్గర అబద్ధాలు చెప్పి ప్రయోజనంలేదు. మీ రహస్యాలన్నీ నాకు తెలుసు. భూగృహం మహారాజుగారి మరణానికి కారకులు మీరు. ఆయనకు విషమిచ్చి చంపిన రాజవైద్యుడిని చంపింది మీరు. మీరు కోరిన ధనం ఇవ్వలేదన్న నెపంతో భవానీ పురంలోని ఒక ధనికుడిని హత్య చేసింది మీరు. ఏమంటారు ? ఇవన్నీ నేను కళ్ళారా

చూడకపోయినా, చూసినట్టే లెక్క. ఈ అపరాధాల నన్నిటిని నిరూపించగలను.”

ఈ మాటలు వింటున్న మంత్రి గజగజ వణకిపోనారంభించాడు. బికారి సంగతి ఇక చెప్పనే అక్కరలేదు. ఎంత ప్రయత్నించినా నోటి వెంట మాటకూడా రావడంలేదు.

ఆ వ్యక్తి మళ్లీ తన కథనం కొనసాగించాడు.

“ఇంతేకాదు. ఇంకా మీరు చేసిన పనులనేకం ఉన్నాయి. రఘువీర్ మహారాజు నవవధువును తారుమారు చేశారు. సమరసింహుడిని బంధించారు. బాబాజీ కూతురు మాలతిని బంధించి తీసుకువచ్చారు. ఇవన్నీ మీరు చేసిన నేరాలే. ఈ నేరాలన్నీ మీరే చేసినట్టు నేను రుజువుచెయ్యగలను.”

మంత్రిసాధుకు పిచ్చెక్కినట్టయింది. ఒక ప్రక్క తల తిరిగి పోతోంది. తాము చేసిన పనులన్నీ ఎవరికీ తెలియవని ఇంతవరకు సంతోషిస్తూ వచ్చాడతను. కాని ఇప్పుడీ వ్యక్తి ఎవరో యముడులా వచ్చాడు. ఇతను తమ పాలిటి మృత్యుదేవత అయి ఉండాలి.

అతను మళ్ళీ ప్రారంభించాడు.

“నేను చెప్పిన మాటలన్నీ విని కంగారుపడకండి. ఇవన్నీ మీరే చేసినట్టు అంగీకరిస్తారా లేదా? నేనీ విషయాలను బయటపెడితే మీ ప్రాణాలకే హాని కలుగుతుందని నాకు తెలుసు. అయితే నేను బయట పెట్టను. ఈ ఒక్క విషయంలో మీకు నేను సాయం చెయ్యగలను. అయితే మీరూ ఇందుకు ప్రతిఫలంగా నాకు సాయం చెయ్యాలి.”

మంత్రి కీ మాటలు వినగానే ప్రాణాలమీద కొంత ఆశ కలిగింది.

"మా రహస్యాలను బయటపెట్టకుండా ఉంటే నీకు కావలసిన సహాయాలు మేం చెయ్యగలం. మా విషయంలో నువ్వు చెప్పిన సంగతులన్నీ నిజం కాకపోయినా కొన్ని నిజమేనని అంగీకరిస్తున్నాను," అన్నాడు హీనస్వరంలో.

బికారికూడా నిజమేనన్నట్టుగా దీనంగా తల ఊపాడు. అతను ప్రాణాలన్నీ గుప్పిట్లో పెట్టుకు కూర్చున్నట్టున్నాడు.

ఆ వ్యక్తి నోరు విప్పాడు.

"నేను ముఖ్యంగా మాలతిని గురించి ఇప్పుడు మీతో మాట్లాడడానికి వచ్చాను. ఆమె మీకు ఎలాంటి అపకారమూ చెయ్యలేదు. అలాంటప్పుడు ఆమెను మీరు ఎందుకు బంధించాల్సి వచ్చిందో నా కవగాహన కావడం లేదు."

"మాలతి విషయంలో నువ్వు చెప్పింది నిజంకాదు. ఆమె విషయం నా కేమీ తెలియదు," సాధు అన్నాడు.

ఆ వ్యక్తి బికారివైపు తిరిగాడు.

"నీకూ తెలియదు కదూ?" ప్రశ్నించాడు గంభీరంగా.

బికారి నోటి వెంట జవాబు రాలేదు. లేదన్నట్టు మాత్రం తల ఊపాడు.

ఆ వ్యక్తి వికటంగా నవ్వాడు.

"మళ్ళీ అబద్ధాలు ప్రారంభమయ్యాయి. అబద్ధాలాడినందువల్ల ప్రయోజనంలేదు. నిజాలు బయటపడక తప్పదు. అప్పుడు మరింత అపాయకర పరిస్థితు లేర్పడతాయి. అందు

కని ముందుగానే అన్ని సంగతులూ ఆలోచించుకుని నాతో మాట్లాడండి.”

“నేను నిజమే చెబుతున్నాను. ఆమె మావద్ద బందీగా లేదు,” సాధు అన్నాడు.

“మీ వద్ద బందీగా లేకపోవచ్చు. మీరే ఆమెను మరొక చోట బంధించి ఉండవచ్చు,” అన్నాడు ఆ వ్యక్తి నవ్వుతూ.

“అలాంటిదేమీ జరగలేదు,” ధైర్యంచేసి అన్నాడు చివరికి బికారి.

‘మాలతి ఎక్కడుందీ చివరికెలాగైనా తెలుస్తుంది. ఇంతవరకు బాబాజీ మిమ్మల్నెప్పుడూ అనుమానించలేదు. ఇప్పుడు తన కుమార్తెకోసం ఆయన అంతు తేల్చుకోకుండా వదలడు. ఆయన ముందు మీరు గడ్డిపోచల్లాంటి వాళ్లు. ఆయన తల్చుకుంటే మీ రెంత?” అన్నాడా వ్యక్తి కొంచెం కోపాన్ని నటిస్తూ.

బాబాజీ పేరు వినగానే మంత్రి కంగారు ఎక్కువైంది. ఆయన శక్తి సామర్థ్యాలు మంత్రికి బాగా తెలుసు. అతను తన కంగారును అణచుకోడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

“మీరు మాట్లాడుతూ ఉండండి. నేను ఒక్క క్షణంలో తిరిగి వస్తాను. ఒంట్లో బాగున్నట్టులేదు. మందు తాగి వస్తాను.”

ఆ వ్యక్తి సరేనన్నట్టు తల ఊపాడు. మంత్రి వెనుక గదిలోకి వెళ్తూ చేసిన సంజ్ఞలోని భావాన్ని బికారి గ్రహించాడు.

మంత్రి వెళ్ళిపోగానే బికారి ఆ వ్యక్తికేసి తిరిగాడు.

"మీరు బాబాజీ శక్తి సామర్థ్యాలను గురించి చెప్పిన మాట నిజమే. అలాంటి వ్యక్తితో కలహం పెట్టుకోవడం నిప్పుతో చెలగాటమేనని మాకు మాత్రం తెలియదూ! మాలతి విషయంలో నిజంగా మాకేమీ తెలియదు. బాబాజీ మాకు ఆప్తులలో ఒకడు. ఆయనకు మేం ఎందుకు అపకారం తలపెడతాం," అన్నాడు.

ఆ వ్యక్తి వ్యంగ్యంగా నవ్వాడు.

"మీరు ఆప్తులకే అపచారం తలపెట్టే వ్యక్తులని నాకు తెలుసు. భూగృహం మహారాజు మీకు ఆప్తుడుకాక శత్రువా? రఘువీర్ మీకు విరోధికాదుకదా! సమర సింహుడు మాత్రం మీ కెందుకు వ్యతిరేకి అయ్యాడు?"

బికారి ఈ ప్రశ్నలకేమీ సమాధాన మివ్వలేదు. ఒక ప్రక్క అతని మనస్సు ఆ వ్యక్తి ఎవరై ఉంటారా అని దీర్ఘంగా ఆలోచిస్తోంది. మారు వేషంలో ఉన్న అతనెవరో ఊహించడానికూడా ఏ మాత్రం వీలు కాకుండా ఉంది.

మంత్రిసాధు కాసేపటిలో తిరిగి వచ్చాడు. అతను దగ్గరికి రాగానే ఆ వ్యక్తి చూపులు మంత్రిమీదకి తిరిగాయి. అంతే. మరుక్షణంలో బికారి ఆ వ్యక్తి మీదకి దూకి రెండు చేతులతో సహా అతనిని గట్టిగా అదిమి పట్టుకున్నాడు. మంత్రి సంజ్ఞ ప్రకారం కౌసలా భటుడు కూడా బికారికి సాయపడ్డాడు.

మరుక్షణంలో మంత్రి తన చేతిలో ఉన్న మత్తుమందును ఆ వ్యక్తి ముక్కు దగ్గర ఉంచాడు. అది చాలా ఘాటైన

మత్తు మందు కావచ్చు ఆ వ్యక్తి కళ్లు వెంటనే మూసుకు పోయాయి. కూర్చున్న కుర్చీలో వెనక్కి వాలిపోయాడు.

మంత్రి విజయ సూచకంగా బికారి కేసి చూశాడు. బికారి ఆనందంగా నవ్వాడు. వాళ్ల గుండెల్లో బరువు కొంత తీరి పోయినట్టుంది.

"నీళ్లు తీసుకురా. ఇతనెవరో ముందు తేల్చుకుందాం," అని బికారి భటుడి కాజ్ఞాపించాడు.

భటుడు నీళ్లు తేడానికి వెళ్ళాడు. బికారి ఆ వ్యక్తి గడ్డాన్ని పీకడానికి ప్రయత్నించాడు కాని అది అంత సులభంగా ఊడి రాలేదు.

ఇంతలో భటుడు నీళ్ళతో సహా తిరిగి వచ్చాడు.

"మొఖాన నీళ్ళు పోసి కడుగు," బికారి అతని కాజ్ఞాపించాడు.

భటుడు నీళ్లు చేతిలోకి తీసుకున్నాడు అంతే. ఆ గదిలో గంభీరాట్టహాసం ప్రతిధ్వనించింది. మంత్రి, బికారి, భటుడు కంగారుగా అటూ ఇటూ చూశారు.

ఆ వ్యక్తి లేచి నిలబడ్డాడు. జేవురించిన కళ్లలోంచి నిప్పులు కురుస్తున్నాయి.

"పాపం. మోసపోయారు. మీలాంటి వాళ్ల ఎత్తుగడ లెలా ఉంటాయో నాకు ముందుగానే తెలుసు నేనన్ని టికి సిద్ధమయ్యే ఇక్కడికి వచ్చాను. మీ ఆటలు నా దగ్గర సాగవు. మీ మత్తుమందులు నన్నేమీ చెయ్యలేవు. కేవలం ఒకసారి మిమ్మల్ని పరీక్షించడానికి వచ్చాను. వచ్చిన పని

అయిపోయింది. ఇక నేను వెళ్తాను," అంటూ ఆ వ్యక్తి వెనక్కి నడిచాడు.

ఆశ్చర్య సంభ్రమాలతో తబ్బిబ్బయిపోతున్న మంత్రి, బికారి ఏమీ చెయ్యలేకపోయారు. భటుడు చేతిలో సీటితో అలాగే శిలా విగ్రహంలా నిలబడి పోయాడు. రెప్పపాటు కాలంలో అతను వెనక్కి తిరిగి సారంగంగుండా బయటికి వెళ్ళిపోయాడు.

కాసేపటివరకు గుహలో ఉన్న వాళ్ళెవరికీ తెలివి రాలేదు. చివరికి మంత్రి తన ఆసనంలో దభీమని కూర్చొబడ్డాడు. బికారి కూడా తన కుర్చీలో కూర్చున్నాడు. భటుడు తన స్థానానికి వెళ్ళిపోయాడు.

"ఇంతకూ ఈ వ్యక్తి ఎవరో తెలియనేలేదు!" అన్నాడు మంత్రి ఆశ్చర్యంగా.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. నేను బయటికి వెళ్ళి అతనిని రహస్యంగా అనుసరించడానికి ప్రయత్నిస్తే—" అన్నాడు బికారి.

"వద్దు. ఇతనెవరో సామాన్యుడు కాదు. నువ్వు బయటికి వెళ్ళి అతనిని అనుసరించడం చాలా అపాయకరమనిపిస్తోంది నాకు," సాధు అన్నాడు.

బికారి మారు మాట్లాడలేదు. ఒక్క నిమిషం ఆగి నెమ్మదిగా అన్నాడు.

"ఈ వ్యక్తి బాబాజీకాని, రుద్రదేవుడు కాని, యమమాతకాని అయి ఉండాలని నా అనుమానం."

"యమదూత అయితే మనం అంతగా కంగారుపడ వలసిన అవసరంలేదు. అతను ఒక ప్రక్క మన చేతిలో చిక్కి ఉన్నాడు, మన కున్నంత భయం ఈ విషయాలలో అతనికీ ఉంటుంది. ఇక వచ్చింది బాబాజీ అయితే మాత్రం ప్రాణాలమీదికి రాక తప్పదు. రుద్రదేవుడయినా అంతే. అతను బాబాజీ ముఖ్యానుచరుడు," సాధు సాలోచనగా అన్నాడు.

"మన ఈ స్థావరాన్ని తెలుసుకోగల శక్తి సామర్థ్యాలు ఈ ముగ్గురికీ ఉన్నాయి. రుద్రదేవుడుకూడా సామాన్యుడు కాదు," బికారి అన్నాడు.

సాధు ఏదో ఆలోచనలో మునిగిపోయి కాసేపటివరకు మాట్లాడలేదు. చివరికి నెమ్మదిగా ఇలా అన్నాడు.

"మన ఈ స్థావరాన్ని ఇంతవరకు ఎవరూ తెలుసుకో లేక పోయారు కాబట్టి మనం ధీమాగా అన్ని పనులూ నిర్వ హించుకో గలిగాం. కాని ఇప్పుడు పరిస్థితులు మారాయి. వచ్చింది ఎవరైనప్పటికీ మన స్థావరం సంగతి ఇతరులకి తెలిసినట్టే లెక్క."

"ఔను. ఒక్కరికి ఇప్పుడీ సంగతి తెలిస్తే అందరికీ రెండు రోజుల్లో తెలియవచ్చు." బికారి మధ్యలో అన్నాడు.

"అందుకే ముందు మనం తగు జాగ్రత్తలో ఉండడం అవసరం. ముఖ్య ఖైదీలు కొంద రిక్కడ ఉన్నారు. వాళ్లను మనం మరో చోటికి మార్చాల్సి ఉంటుంది. ఇప్పుడు మనం ముఖ్యంగా చెయ్యవలసిన పని ఇది. తర్వాత మిగిలిన

సంగతులు ఆలోచించుకోవచ్చు," అన్నాడు మంత్రిసాధు నిశ్చయపూర్వకంగా.

బికారి సరే నన్నట్టుగా తల ఊపాడు.

"ఖైదీలను ఎక్కడికి మార్చేదీ, ఏ రూపంలో ఉంచేదీ మీరు ఆలోచించండి. మీరు చెప్పిన ప్రకారం చెయ్యడానికి నేను సిద్ధంగా ఉన్నాను," అన్నాడు.

మంత్రిసాధు ఖైదీలకు సంబంధించిన ఆలోచనలో మునిగిపోయాడు. బికారి కూడా ఆలోచనలో పడ్డాడు. ఏదో దిగులు వాళ్ళిద్దరినీ పట్టుకు పీడించ సాగింది. గడచిన సంఘటన పీడకలలా వాళ్ళకనిపించింది.

# 6

"రణధీర్‌ను, రుక్మిణిని స్పృహ లేకుండాచేసి గుర్రాల తీసుకువెళ్తున్న రౌతులు కొంత దూరం వెళ్ళి ఆగిపోయారు. వెనుకనించి వినిపించిన గుర్రాల డెక్కల చప్పుడు అక్కడికి వినిపించడంలేదు.

"వాళ్ళెవరో వెళ్ళిపోయినట్టనిపిస్తోంది. వీళ్ళిద్దరూ ఎవరో మనం ముఖాలు కడిగి తెలుసుకుంటే మంచిది. శత్రు బృందంలో వాళ్ళయితే బంధించి తీసుకుపోవచ్చు. లేదా ఇక్కడే వదిలేసి వెళ్ళిపోదాం," అన్నాడు రౌతుల నాయకుడు.

తమ చేతికి చిక్కిన వ్యక్తులలో రుక్మిణిని మాత్రం వాళ్ళు గుర్తుపట్టగలిగారు. రణధీర్‌ను వాళ్ళంతకు ముందెన్నడూ

చూసి ఉండవపోవడంచేత అతనిని వాళ్ళు గుర్తుపట్టలేక పోయారు.

"ఇతనెవరో క్రొత్త వ్యక్తిలా కనిపిస్తున్నాడు. ఇంతకు ముందెన్నడూ చూసినట్లు జ్ఞాపకంలేదు. బహుశా రుక్మిణి సహాయకులలో ఎవరైనా అయి ఉండవచ్చు" అన్నాడు రౌతుల నాయకుడు.

"అలాగే అనిపిస్తోంది," సహచరులలో ఒకత నన్నాడు.

రౌతుల నాయకుడు రుక్మిణి ముఖం కేసి కొంసేపు పరీక్షగా చూసి అన్నాడు.

"మంత్రిగారు రుక్మిణి నిదివర కనేకసార్లు బంధించారు. ఎవరో ఆమెను విడిపించుకుపోవడం కూడా జరిగింది. ఇప్పు డీమెను తిరిగి మంత్రిగారి దగ్గరికి పంపితే ఆయన ఆనం దిస్తాడు."

"ఔను. వెంటనే ఒకళ్ళీమెను తీసుకుని భూగృహానికి వెళ్ళడం మంచిది," అన్నాడు అనుచరులలో ఒకతను.

"ఆ పని నువ్వే చెయ్యి. మేం ఈ వ్యక్తిని తీసుకుని భవానీపురం వెళ్ళిపోతాం," అన్నాడు నాయకుడు.

ఆ అనుచరుడందు కంగీకరించాడు. స్పృహతోల్పోయి ఉన్న రుక్మిణిని తాళ్లతో బంధించి ఆమెను తన గుర్రంమీద ఎక్కించాడు. మరుక్షణంలో తన సహచరులవద్ద సెలవు పుచ్చుకుని భూగృహం వైపు సాగిపోయాడు. మిగిలిన వాళ్లు రణధీర్‌ను వెంటపెట్టుకుని భవానీపురం వైపు బయలుదేరారు.

భూగృహంవైపు బయలుదేరిన వ్యక్తి ఇంకా ఎక్కువ దూరం వెళ్ళలేదు ; ఎవరో తనను అనుసరిస్తున్నట్టు అతనికి అనుమానం కలిగింది. అనుమానంకొద్దీ అతను వెనక్కి తిరిగి చూశాడు.

కొంత దూరంలో అతనికొక గుర్రం కనిపించింది. అది తన వైపే వేగంగా రావడం అతను గమనించాడు. తన గుర్రం వేగాన్ని కూడా అతను హెచ్చించాడు. కాని ఏమీ ప్రయోజనం లేకపోయింది.

ఆ గుర్రం కొద్ది సేపటిలోనే ముందు వెళ్తున్న గుర్రాన్ని సమీపించింది. దానిమీద ప్రయాణం చేస్తున్న త్రిపుర మొదటి గుర్రాన్ని దాటి తన గుర్రాన్ని ముందుకు పోనిచ్చింది.

"ఆగు. నీ గుర్రంమీద ఉన్న దెవరో చెప్పు." త్రిపుర గర్జించింది.

అతడామెకు సమాధానం చెప్పడాని కిష్టపడలేదు. ఒరలోంచి కత్తిని బయటికి లాగాడు. మరుక్షణంలో ఒక చిన్న కత్తి దూసుకు వచ్చి అతని గుండెల్లో దిగబడిపోయింది.

ఒక్కసారి బాధగా మూలిగి ఆ వ్యక్తి గుర్రంమీదినించి క్రిందకి జారిపోయాడు. ఆ వెంటనే అతని ప్రాణవాయువులు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

త్రిపుర తన గుర్రంమీదనించి దిగి ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి చూసింది. అతను చనిపోయినట్టు నిశ్చయంగా తెలియగానే ప్రక్కనే ఉన్న గుర్రంమీదనించి రుక్మిణిని క్రిందకి దించింది.

త్రిపుర ఒక్కక్షణం రుక్మిణి ముఖంవంక చూస్తూ నిలబడి పోయింది. రుక్మిణిని ఆమె ఇంతకుముందెన్నడూ చూడలేదు.

బంధింపబడి ఉన్న రుక్మిణి కట్లువిప్పి తన దగ్గర ఉన్న మందు సాయంతో ఆమెను తిరిగి స్పృహలోకి తెచ్చింది త్రిపుర.

రుక్మిణి తెలివిరాగానే చుట్టూ ఓసారి కలయ చూసింది. ప్రక్కనే నిలబడి ఉన్న త్రిపురను, నేలమీద ఒరిగిపోయి ఉన్న వ్యక్తిని చూడగానే ఆమెకు కొంత ఆశ్చర్యం కలిగింది.

రుక్మిణికి గడచిన సంఘటన ఒక్కసారిగా జ్ఞాపకం వచ్చింది. తన మీదకి, తన భర్త మీదకి కొందరు రౌతులు కత్తులతో దూకడం జ్ఞాపకం రాగానే ఆమె కంపించింది.

తనిప్పుడిక్కడ ఒంటరిగా ఉంది. తన భర్త ఏమైనట్టు? ఆ రౌతులుకూడా లేరు. ఒకతను మాత్రమే ఇక్కడ పడి ఉన్నాడు. మిగిలినవాళ్లు ఏమైనట్టు? తన దగ్గర నిలబడి ఉన్న యువతి ఎవరు?

రుక్మిణి మనస్సు పరిపరివిధాల పోసాగింది. భర్తను దుర్మార్గులేంచేశారో! ఇంకా తమ కష్టాలకు అంతులేదు లాగుంది. భగవంతుడింకా తమను కనికరించలేదు.

స్పృహ వచ్చికూడా మాట్లాడకుండా ఏదో ఆలోచనలో మునిగిపోయి ఉన్న రుక్మిణి వంక చూస్తూ త్రిపురఅంది.

"ఈ దుర్మార్గుడెవరో మిమ్మల్ని గుర్రంమీద స్పృహ లేని స్థితిలో తీసుకుపోతుండగా నేను చూశాను. అతనిని చంపి మిమ్మల్ని అతని బారినుండి కాపాడాను.

రుక్మిణి కృతజ్ఞతా పూర్వకంగా త్రిపుర వంక చూసింది. తన భర్త విషయం ఆమెను అడుగుదామనుకుంది కాని ఏదో అనుమానంతో ఆ విషయం ఎత్తలేదు.

"ఇతను ఎక్కడినించి నన్నీ స్థితిలో తీసుకువస్తున్నాడో చూశారా?" ఆమె త్రిపురను అడిగింది.

"నేను చూడలేదు. నే నెక్కడికో బయలుదేరి వెళ్తుంటే దారిలో కనిపించాడు. వెంటనే ఇతనిని అనుసరించాను," సమాధాన మిచ్చింది త్రిపుర.

"నన్నీ క్రూరుడిబారినుండి రక్షించినందుకు కృతజ్ఞురాలిని. మీ రెవరో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది," రుక్మిణి అంది

"నే నెవరో చెప్పే ముందు మీ రెవరో తెలుసుకోవాలని నాకు మరింత ఆరాటంగా ఉంది," అంది త్రిపుర.

"నేను బాబాజీకి సంబంధించిన వ్యక్తిని. బాబాజీని మీరు ఎరిగే ఉంటారు. ఆయనను కలుసుకోడానికి బయలుదేరిన నన్ను దారిలో ఇతడు అడ్డగించి మాయోపాయంతో నేను స్పృహకోల్పోయేట్టు చేశాడు. తర్వాత ఏం జరిగిందీ నాకు తెలియదు," అంది రుక్మిణి.

త్రిపుర ఒక్కక్షణం ఆలోచించి నెమ్మదిగా అంది.

"నన్ను త్రిపుర అని పిలుస్తారు. నేను ఈ ప్రాంతాల్లో ఎప్పుడూ ఏవో పనుల మీద తిరుగుతూనే ఉంటాను. బాబాజీని గురించి నేను చాలాసార్లు విన్నాను. కాని ఆయనను ఎన్నడూ కలుసుకోలేదు," అంది త్రిపుర.

రుక్మిణి మౌనం వహించింది. ఏదో బాధ, విచారం ఆమెను వెన్నంటాయి. మరి కాసేపటికి త్రిపుర అంది.

"మిమ్మల్ని బాబాజీ దగ్గరికి నేను క్షేమంగా చేర్చగలను. ఇద్దరం వెళ్దాం పదండి. అతని గుర్రంమీద మీరు ప్రయాణం సాగించవచ్చు. నాకూ ఓసారి బాబాజీని కలుసుకోవాలని కుతూహలంగా ఉంది. మీ ద్వారానైనా ఆయనను కలుసుకోగలిగినందుకు ఆనందిస్తాను."

రుక్మిణి ఆమెను బాబాజీ దగ్గరికి తీసుకువెళ్ళడాని కంగీకరించింది. అలా చెయ్యడంవల్ల తమకు కలిగే నష్టమేమీ ఉండదని ఆమె ఎంచింది.

ఇద్దరూ వెంటనే గుర్రాలమీద భవానీపురానికి బయలుదేరారు.

"ఈ మధ్య బాబాజీ భవానీపురంలో ఉంటున్నాడని విన్నాను: నిజమేనన్న మాట," అంది త్రిపుర.

"ఔను. ఆయన కుమార్తెను ఎవరో అపహరించారట. అదికాక భూగృహంప్రాంతాల్లో జరిగిన కొన్ని దారుణకృత్యాలకు సంబంధించిన రహస్యాలు సేకరించడంకోసం ఆయన భవానీపురంలోనే ఉంటున్నారు," అంది రుక్మిణి.

ఇద్దరూ భవానీపురంలోని బాబాజీ గృహాన్ని చేరుకునేసరికి బాగా ప్రొద్దుపోయింది. అంతకు క్రితమే బాబాజీ భూగృహం నించి తన భవనానికి తిరిగి వచ్చాడు. భూగృహంలో రఘువీర్ మహారాజును ఆయన కలుసుకున్నాడు. కాని మంత్రి సాధు కనిపించలేదు. ఏదో పని మీద బయటికి వెళ్ళినట్టుగా తెలిసింది.

త్రిపురను ముందు గదిలో కూర్చోబెట్టి రుక్మిణి లోపలికి వెళ్ళింది. బాబాజీ ఒంటరిగా గదిలో విచారంగా కూర్చుని ఉన్నాడు. అకస్మాత్తుగా రుక్మిణిని చూడగానే ఆయనకు ఆశ్చర్యానందాలు కలిగాయి. తన మనస్సులో ఉన్న విష యాన్ని రుక్మిణికి చెబుదామనుకుంటుండగానే రుక్మిణి జరిగిన విషయాలన్నీ బాబాజీకి వివరించి చెప్పింది.

రణధీర్ సంగతి ఆయనకు విచారాన్ని కలిగించినా దిగ మ్రింగుకుని ఊరుకున్నాడు.

“నన్ను ఆ రౌతుబారినుండి కాపాడిన యువతి ముందు గదిలో కూర్చుని ఉంది. ఆమెకు మిమ్మల్ని చూడాలని కుతూహలంగా ఉన్నట్టుంది,” అంది చివరికి రుక్మిణి.

“ఆమెను పంపించి నువ్వు విశ్రాంతి తీసుకో. పరిస్థితు లిప్పట్లో మనకు అనుకూలంగా ఉన్నట్టు కనిపించడంలేదు. రుద్రదేవుడిని మిమ్మల్ని వెదకమని పంపాను. అతను రణధీర్ విషయం చూసుకుంటాడులే. నువ్వు కంగారుపడకు,” అన్నాడు బాబాజీ.

రుక్మిణి వెళ్ళిపోయిన కాసేపటికి త్రిపుర ఆ గదిలో ప్రవేశించి బాబాజీకి నమస్కారం చేసింది. బాబాజీకి ఆమెను చూడగానే మరింత ఆశ్చర్యం కలిగింది. ఆమె ఎవరో బాబాజీకి బాగా తెలుసు. అనేకసార్లు ఆమె చిన్న తనంలో ఆమెను చూశాడు కూడా.

బాబాజీ చిరునవ్వును బలవంతాన ముఖం మీదకి తెప్పించుకుని నెమ్మదిగా అన్నాడు.

"రుక్మిణి నీ గురించి చెప్పింది."

త్రిపుర తలపైకెత్తి ఆయనవంక చూస్తూ సాలోచనగా అంది.

"మీతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని ఇక్కడికి బయలుదేరి వచ్చాను."

"ఏ విషయాలైనా నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు"

"ముఖ్యమైనవి భూగృహం మహారాజా రఘువీర్, ఆయన మంత్రి సాధుకు సంబంధించినవే."

ఈ మాట వినగానే బాబాజీ ఆతురతకొద్దీ ముందుకు జరిగాడు.

"ఏమిటా ముఖ్య విషయాలు?" ఆయన ప్రశ్నించాడు.

"నేనీమధ్య ఏవో పనులమీద ఈ ప్రాంతాల్లో తిరుగుతుండగా నాకు కొన్ని ముఖ్య విషయాలు తెలిశాయి. నాకు తెలిసిన విషయాలు నేను చెబుతాను. వాటిని మీరు నమ్మినా సరే, నమ్మకపోయినా సరే," అంది త్రిపుర.

"అవేమిటో చెప్పు." ఆతురతకొద్దీ అన్నాడు బాబాజీ.

"మంత్రిసాధు తన ముఖ్యానుచరుడు బికారితో కలిసి భూగృహం మహారాజుకు వ్యతిరేకంగా చాలా కుట్రలు పన్నుతున్నాడు. అందులో ముఖ్యమైంది ఆయన వధువును తారుమారు చెయ్యడం. వివాహ సందర్భంలో మీరూ అక్కడే ఉండి ఉంటారు. వాళ్ళ ప్రయత్నం నెరవేరిందో లేదో తెలియదుకాని అసలు వధువుకు బదులుగా మరొక స్త్రీని ఆ వేషంలో కూర్చొబెట్టడానికి వాళ్ళు ప్రయత్నాలు చేశారు," అంది త్రిపుర.

ఈ సంగతి బాబాజీకి పట్టరానంత ఆశ్చర్యం కలిగించింది. మంత్రి సాధు ఏవో దుష్కృత్యాలు చేస్తున్నాడని కొందరు తనతో చెబుతూ వచ్చారు కాని ఈ విషయం గురించి ఎవరూ ఏమీ చెప్పలేదు. పెద్ద పెద్ద పేరు మోసిన గూఢచారులకి కూడా తెలియని రహస్యం ఈ యువతి కెలా తెలిసిందా అని బాబాజీ ఆశ్చర్యపోయాడు.

ఇందులో ఎంతవరకు నిజం ఉందో, ఏమో! ఎవరైనా అనుకుంటున్న వినికిడి మాటలు చెబుతున్నదేమో!

వివాహానంతరం తాను రఘువీర్ మహారాజును కలుసుకొన్నాడు. ఆయన ఇటువంటి సంగతేమీ ఎప్పుడూ చెప్పలేదు. వధువు కూడా ఇప్పుడు ఆయన దగ్గరే ఉంటోంది. అనుమానాస్పదమైన విషయమేదైనా ఉంటే ఆయన తనతో చెప్పకుండా ఉంటాడా?

బాబాజీ ఆలోచనలను కట్టిపెట్టి తలెత్తి ఆ యువతి వంక చూశాడు. ఆమె తన వంకే చూస్తోందని ఆయన గమనించాడు. బహుశా ఈ విషయాన్ని గురించి తన సమాధానాన్ని ఆశిస్తూ ఉండి ఉండవచ్చు.

"ఈ సంగతి నీ కెలా తెలిసింది?" బాబాజీ అడిగాడు.

"నాకు ఎప్పుడూ తిరుగుతూ ఉండడమంటే సర్దా. గూఢచారిపనులు చెయ్యడంలో కొంత నేర్పరితనంకూడా సంపాదించాను. ఒకసారి ఒకవ్యక్తి మంత్రి సాధు దగ్గరినించి ఒక ఉత్తరం ఎక్కడికో తీసుకు వెళ్లడం చూశాను. అతనిని మోసగించి ఎలాగో ఉత్తరం సంపాదించి దానిని

చదివాను. తద్వారా నాకీ విషయాలు తెలిశాయి," అంది త్రిపుర సమాధానంగా.

"ఆ ఉత్తరం నీ దగ్గర ఉందా ?"

"లేదు. దానిని మళ్ళీ అతనికే అప్పగించాను."

"పోనీ ఆ ఉత్తరం ఎవరికి రాయబడిందో చూశావా ?"

"ఉత్తరంమీద పేర్లేమీ లేవు."

"అది మంత్రిసాధు రాసిందేనన్న నమ్మకం నీకెలా కలిగింది ?"

"ఉత్తరంలో క్రింద బికారి సంతకం చేశాడు. కాబట్టి మంత్రి సాధు వ్రాయకపోయినా ఆయన వ్రాయించి ఉంటాడనుకున్నాను."

బాబాజీ ఇంకేమీ అడగలేదు. కాసేపు మౌనంగా ఆలోచించి తర్వాత అన్నాడు.

"ఇటువంటి విషయాలు సరైన నిదర్శనాలు దొరికితే తప్ప నమ్మడానికి వీలులేదు. అయినా ఇందులో ఎంతవరకు నిజం ఉందో తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను," అన్నాడు బాబాజీ.

త్రిపుర లేచి నిలబడింది. తాను వచ్చిన పని ముగిసినట్టే.

"సెలవు. ఇక వస్తాను. నాకు తెలిసిన విషయాలు మీకు తెలియచేశాను. ఇందులోని నిజానిజాల విషయాలు మీరు తేల్చుకోవలసిందే," అంటూ నెమ్మదిగా బయటికి దారి తీసింది.

వెళ్ళిపోతున్న ఆమెవంక చూస్తూ బాబాజీ ఆలోచనలో మునిగిపోయాడు. మాలతి ఆయన కళ్ళముందు మెదలి

ష్టయింది. ఇంతవరకు ఆమె జాడ తెలియనేలేదు. ఆమెను బంధించాల్సిన అవసరం ఎవరికి కలిగిందో బాబాజీ కనుగొనను కాలేదు కూడా. ఆయన గంభీరాలోచనలో అలాగే కూర్చుండిపోయాడు.

# 7

ధనాసిపురం వైపు బయలుదేరాడు యమదూత. తానీమధ్య తెలుసుకున్న అనేక రహస్యవిషయాలను గురించి బాబాజీతో మాట్లాడాలని అతని ఉద్దేశం. తానెన్నిసార్లు చెప్పినా మంత్రి సాధు మీదకి ఆయన అనుమానం పోవడంలేదు. ఈ సారి ఎలాగైనా సరే తగిన నిదర్శనాలు చూపి ఆయన దృష్టిని మంత్రి మీదకి మరలించాలి.

ఆలోచిస్తూ నెమ్మదిగా నడచిపోతున్న యమదూతకు వెనకనించి ఏవో గుర్రాలు పరుగెత్తుకు వస్తున్న చప్పుడు వినిపించింది. యమదూత అకస్మాత్తుగా ఆగిపోయాడు. చుట్టూ బాగా చీకటిగా ఉంది. వెంటనే అతను ఒక పెద్ద చెట్టు చాటుకు తప్పుకున్నాడు.

కాసేపట్లోనే కొన్ని గుర్రాలు తన వైపు పరుగెత్తుకు రావడం యమదూత చూశాడు. రౌతుల చేతుల్లో కాగడాలు కూడా ఉన్నాయి. ఆ కాగడాల కాంతిలో వాళ్ళ ముఖాలు స్పష్టంగానే కనిపిస్తున్నా వాళ్ళెవరో యమదూత గుర్తుపట్టలేకపోయాడు.

వేషాలను బట్టి వాళ్ళెవరో సాధారణ భటుల్లా ఉండాలని యమదూత నిశ్చయించుకున్నాడు. అతను నిశ్చయించు

కునే లోపల గుర్రాలు మరింత దగ్గరగా వచ్చాయి. రెండు మూడు గుర్రాలు ముందు వస్తున్నాయి. వాటికి కొంచెం దూరంగా ఒక గుర్రం వస్తోంది. ఆ గుర్రంమీద రౌతుకాక మరొక బందీ కూడా ఎవరో ఉన్నాడు. అందుచేత గుర్రం కొంచెం నెమ్మదిగా పరుగెడుతోంది. మొదటి రెండు మూడు గుర్రాలు మాత్రం చాలా వేగంగా వస్తున్నాయి.

చివరి గుర్రాన్ని ఎలాగైనా ఆపి దానిమీద బందీగా ఉన్న వ్యక్తి ఎవరో తెలుసుకోవాలనుకున్నాడు యమదూత. ముందు గుర్రాలు తనను దాటిపోయేవరకు చెట్టు చాటునే నిలబడ్డాడు.

చివరి గుర్రం చెట్టు దగ్గరికి రాగానే యమదూత విసిరిన కత్తి దాని కాలిమీద బలంగా గుచ్చుకుంది. గుర్రం టక్కున ఆగిపోయింది. వెనుక గుర్రం ఆగిపోయిన సంగతి ముందు వెళ్తున్న రౌతులు గమనించనేలేదు.

గుర్రం పరుగెత్తడం మానగానే దానిమీద ప్రయాణం చేస్తున్న రౌతు కంగారుగా దిగాడు. అయితే గుర్రం ఎందుకాగిపోయిందో అతనికవగాహన కాలేదు. గుర్రం వంక పరిశీలనగా చూస్తూ అతను ఒక్క క్షణం నిలబడ్డాడు. అతని చేతిలో కాగడాలాంటిదేదీ లేదు.

అప్పటికి ముందు గుర్రాలు వెనుక చూపు లేకుండా చాలా దూరం వెళ్ళిపోయాయి. ఇదే అదననుకున్న యమదూత చీకటిలో రౌతుకు కనిపించకుండా వెనకనించి అతని మీదకి దూకాడు. గొంతు బలంగా నొక్కి పట్టి తన దగ్గర ఉన్న మత్తుమందును అతనికి వాసన చూపించాడు.

మరుక్షణంలో ఆ రౌతు స్పృహ కోల్పోయి యమదూత చేతుల్లోంచి నేలమీదకి ఒరిగిపోయాడు. తానక్కడ ఇంకా ఎక్కువసేపు నిలబడడం మంచిదికాదనుకున్నాడు యమదూత. ఆలస్యమైతే ముందు వెళ్ళిన రౌతులు తమ సహచరుడు తమతో రాకపోవడం గమనించి వెనక్కి తిరిగి రావచ్చు.

యమదూత వెంటనే గుర్రం కాలికి గుచ్చుకున్న తన కత్తిని బలంగా బయటికి లాగాడు. గుర్రంమీద బంధింపబడి ఉన్న వ్యక్తి వంక పరీక్షగా చూడకుండానే అతనిని భుజాన వేసుకుని చెట్లచాటుగా దారివిడచి అరణ్యంలో ప్రవేశించాడు. గబగబా అడుగులు వేసుకుంటూ నిశ్శబ్దంగా చాల దూరం వెళ్ళిపోయాడు.

ఇక ఆ రౌతులు తనను కనుక్కోలేరని నిశ్చయించుకోగానే యమదూత భుజంమీది వ్యక్తిని క్రిందకి దించి తాను కూడా అతని ప్రక్కనే కూర్చున్నాడు. తన దుస్తుల్లోంచి కొవ్వొత్తిని బయటికి లాగి వెలిగించాడు.

ఆ వెలుతురులో యమదూత ఆ వ్యక్తి వంక చూశాడు. ఆశ్చర్యంగా ఒక్కసారి వెనక్కి తూలాడు. అతను రణధీర్. రణధీర్ ఇంతవరకు మారు వేషంలో బయట తిరుగుతూ వచ్చాడు తప్ప మామూలు వేషంలో ఎప్పుడూ బయటికి రాలేదు. ఈ రోజు అతను స్వంత వేషంలో బయటికి రావడంలో గల ఉద్దేశం యమదూతకు బోధపడలేదు.

వెంటనే ఆలోచనలోంచి తేరుకున్నాడు యమదూత. ఏది ఏమైనా అదృష్టంకొద్దీ రణధీర్‌ను శత్రువుల బారినుండి

తాను తప్పించగలిగాడు. బహుశా ఆ రౌతులు మంత్రి సాధుకు సంబంధించిన వాళ్ళయి ఉంటారని యమదూత నిశ్చయించుకున్నాడు.

రణధీర్‌కు స్పృహ తెప్పించి అతనితో అన్ని విషయాలూ మాట్లాడాలనిపించింది యమదూతకు. కాని ఇది అందుకు తగిన సమయం కాదేమో అనుకున్నాడతను వెంటనే.

రణధీర్‌ను భుజాన వేసుకుని తిరిగి యమదూత భవానీపురంవైపు ప్రయాణం ప్రారంభించాడు. ఆ రౌతులలో ఎవరూ అతనికి మళ్ళీ కనిపించలేదు. గాఢాంధకారం అన్ని ప్రక్కలా అలముకుని ఉంది. రణధీర్‌ను భుజాన వేసుకుని నడవడం యమదూతకు కష్టమనిపించినా తప్పలేదు.

సాధారణంగా ఏవైన పనుల మీద బయలుదేరినప్పుడు యమదూత గుర్రంమీద వెళ్ళడు. గూఢచారులకి గుర్రాలు ఉండకూడదన్న నమ్మకం ఉన్న వాళ్ళలో యమదూత ఒకడు.

నెమ్మదిగానే నడుస్తూ యమదూత చివరి కెలాగో భవానీపురంలోని బాబాజీ భవనాన్ని చేరుకున్నాడు. భవనం చుట్టూ చాలా నిశ్శబ్దంగా కూడా ఉంది. ప్రధాన ద్వారం దగ్గరికి వెళ్ళగానే యమదూత రణధీర్‌ను భుజంమీదినించి క్రిందకి దించి కాపలా భటుడి వంక చూశాడు.

"బాబాజీ ఉన్నారా?" యమదూత అడిగాడు.

"లోపల నిద్రపోతున్నట్టున్నారు," భటుడు సమాధానమిచ్చాడు.

"యమదూత వచ్చాడని ఆయనకు తెలియచెయ్యి. అత్యవసరమైన పనిమీద వచ్చానని, చాలా ముఖ్య విషయాలు మాట్లాడాలని చెప్పు," అన్నాడు యమదూత.

యమదూత అన్న పేరు వినగానే భటుడు సంకోచించకుండా లోపలికి వెళ్ళిపోయాడు. కాసేపటికి తిరిగి వచ్చి ద్వారం తెరిచాడు.

"తిన్నగా లోపలికి వెళ్ళండి," అన్నాడు యమదూతతో.

యమదూత మళ్లీ రణధీర్‌ను భుజాన వేసుకుని ప్రధాన ద్వారం దాటి భవనంలో ప్రవేశించాడు. తిన్నగా బాబాజీ కూర్చుని ఉన్న గదిలో అడుగు పెట్టాడు.

యమదూత తన భుజంమీదినించి దింపిన రణధీర్‌ను చూడగానే బాబాజీకి అంతులేని ఆనందం కలిగింది. సంతోషంతో మెరుస్తున్న కళ్ళతో బాబాజీ యమదూత వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

యమదూత తాను భవానీపురానికి వస్తుండగా అడవిలో జరిగిన అన్ని విషయాలు బాబాజీకి తెలియచేశాడు. బాబాజీ కూడా రణధీర్, రుక్మిణి శత్రువుల చేతుల్లో ఎలా చిక్కింది రుక్మిణి ఎలా విడిపించబడిందీ యమదూతకు తెలియచేశాడు. త్రిపుర పేరు వినగానే యమదూతకు కొంత ఆశ్చర్యం కలిగినా ఆ ఆశ్చర్యాన్ని బయటికి కనిపించనివ్వలేదు.

"రణధీర్‌కు సంబంధించి నీమీద ఎన్ని అపవాదులున్నా ఈ రోజు నువ్వతనికి చేసిన సహాయంతో అవన్నీ తుడిచిపెట్టుకోగలవు," అన్నాడు బాబాజీ.

యమదూత ఏమీ మాట్లాడలేదు. మౌనంగా తలవంచు కున్నాడు.

"ఇంతకూ ఇక్కడికి నువ్వు వచ్చిన పని ?" అన్నాడు బాబాజీ యమదూత వంక చూస్తూ.

"మంత్రిసాధుకు సంబంధించిన విషయాలు మీతో మాట్లాడదామని బయలుదేరాను. కాని దారిలో ఆలస్య మైంది," అన్నాడు యమదూత.

"సరే. ఈ పూట నువ్వు ఇక్కడే విశ్రాంతి తీసుకో. తెల్లవారింతర్వాత అన్ని విషయాలూ సాకల్యంగా మాట్లాడుకుందాం." అన్నాడు బాబాజీ.

దాదాపు అర్ధరాత్రి కావడంవల్ల బాబాజీ నిద్రకు భంగం కలిగించడం ఇష్టంలేక యమదూత అందు కంగీకరించాడు. వెంటనే అక్కడినించి లేచి ప్రక్కగదులవైపు వెళ్ళి పోయాడు.

యమదూత వెళ్ళిపోయిన కాసేపటికి బాబాజీ తన దగ్గర ఉన్న మందు సాయంతో రణధీర్‌కు స్పృహ తెప్పించాడు. స్పృహ రాగానే రణధీర్ ఆశ్చర్యంగా అన్ని ప్రక్కలా కలయచూశాడు.

అడవిలో యుద్ధభూమిలో ఉండాల్సిన తాను బాబాజీకి ఎదురుగా గదిలో పడి ఉండడంలో విశేషమేమిటో రణ ధీర్‌కు వెంటనే తెలియలేదు.

బాబాజీ అన్ని సంగతులూ రణధీర్‌కు వివరంగా తెలియ చేశాడు. యమదూత ఈ సందర్భంగా అతనికి చేసిన సహాయాన్ని గురించి విస్తరించి చెప్పాడు.

"యమదూత దుర్మార్గుడని మీరందరూ భావించినా నేనలా భావించలేకపోతున్నాను. అతను దుర్మార్గుడిలా ప్రవర్తించడానికి కారణం పరిస్థితి తప్ప అతని సహజప్రకృతి మాత్రం కాదు," అన్నాడు బాబాజీ చివరికి.

రణధీర్ మాట్లాడలేదు. క్షణకాలం యోచనలో మునిగి పోయాడు. మళ్లీ బాబాజీ అతని వంక చూస్తూ ఇలా అన్నాడు.

"ఇక్కడి పరిస్థితులు అంత బాగుండలేదు. ఎలాగో మీ విషయం యమదూతకు తెలిసిపోయింది. కొద్ది రోజుల్లో ఏదో విధంగా మీ రహస్యం బయటపడక తప్పదు. అందు చేత మీరు రుక్మిణితో సహా మీ రాజ్యానికి తిరిగి పోవడం మంచిదని నా సలహా. మిమ్మల్ని చూసి మీ తండ్రిగారు ఎంతో ఆనందిస్తారు. ఆయన పేర నేనొక ఉత్తరం కూడా రాసిస్తాను"

"కాని——" మధ్యలోనే రణధీర్ అన్నాడు. "ఇక్కడ ఉండి ఈ విపత్కర పరిస్థితుల్లో మీకు సాయం చెయ్యాలని మాకు ఉత్సాహంగా ఉంది."

బాబాజీ శుష్కహాసం చేశాడు.

"బాహుబలంలో, శక్తిసామర్థ్యాలలో మీరు గొప్పవాళ్లు కావచ్చు. మీ బలాలు గూఢచారుల మాయోపాయాల ముందు పనికి రావు. మీరు ఎంతో బలవంతులై ఉండి కూడా శత్రువుల సామాన్య గూఢచారుల చేతుల్లో ఎన్ని సార్లు చిక్కలేదు! అందుచేత ఇప్పటి ఈ పరిస్థితుల్లో మీరు నాకంతగా సాయం చెయ్యలేరని నా నమ్మకం.

అందుకే నేను మిమ్మల్ని మీ రాజ్యానికి వెళ్ళి పొమ్మంటు న్నాను. నా మాట వినండి," అన్నాడు బాబాజీ.

బాబాజీ చెప్పింది నిజమే. తమ బాహుబలాలు గూఢ చారుల తంత్రాల ముందు పనికిరావు. రణరంగంలో మాత్రమే తమ ప్రతాపాలు పనికి వచ్చేది. అందుచేత బాబాజీ చెప్పిన ప్రకారమే చెయ్యడానికి నిశ్చయించు కున్నాడు రణధీర్.

"సరే, మీ యిష్టం. మిమ్మల్ని కాదని మేం చెయ్యగలిగే దేముంది?" అన్నాడు రణధీర్.

బాబాజీ మందహాసం చేశాడు.

"మీ ప్రయాణానికి రేపు ఏర్పాట్లు చేయించుతాము. ఈ రాత్రికి మీరు కూడా విశ్రమించండి," అన్నాడు.

ఉన్నట్టుండి రణధీర్ కేదో విషయం జ్ఞాపకం వచ్చి నట్టయింది.

"మాలతి సంగతులేమీ తెలియలేదుకదా?" విచారాన్ని సూచించే కంఠంతో అడిగాడు.

రణధీర్ మాలతి సంగతి ఎత్తగానే బాబాజీ ముఖం వివర్ణమైంది. విచారం ఆయన్ని ఆక్రమించింది.

"ఎంత ప్రయత్నించినా మాలతి జాడ మాకు తెలియనే లేదు. ఇంతవరకు కష్టాలన్నది ఎరగదు. ఎక్కడ ఎన్ని కష్టాలననుభవిస్తోందో!" అన్నాడు బాబాజీ బాధగా.

రణధీర్ విచారంగా తలవంచుకున్నాడు.

"సరే, మీరు నిద్రపోండి. రేపు మిగిలిన సంగతులు మాట్లాడుకుందాం," అంటూ రణధీర్ ఆ గదిలోంచి బయటికి నడిచాడు.

బాబాజీ మాలతిని గురించి ఆలోచిస్తూ నెమ్మదిగా మంచంమీద మేను వాల్చాడు.

## 8

తెల్లవారింది. క్రమంగా భవానీపురం కోలాహలంలో మునిగిపోసాగింది. ఎవరి పనులలో వాళ్ళు విధి విరామం లేకుండా తిరుగుతున్నారు. సూర్యుడు క్రమంగా ఆకాశంలో పైకి ప్రాకిపోతున్నాడు.

యమదూత బాబాజీ భవనంలో ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. బాబాజీ రాత్రి మాట్లాడుకున్న ప్రకారం రణధీర్‌ను, రుక్మిణిని స్వస్థలాలకు పంపే ఏర్పాటులో మునిగిపోయాడు.

బాబాజీ తన పనులు ముగించుకుని మిగిలిన పనులకు రుద్రదేవుడిని నియోగించి యమదూత దగ్గరికి తిరిగి వచ్చేసరికి బాగా ప్రొద్దెక్కింది.

"ఇంత ఆలస్యం అవుతుందని అనుకోలేదు. పాపం వాళ్లు వదలలేక వదలలేక వెళ్ళారు," అన్నాడు బాబాజీ యమదూతతో.

యమదూత వంచిన తల పైకెత్తి బాబాజీ వంక చూశాడు.

"రణధీర్ గారితో ఒకసారి మాట్లాడి నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాలని నేను ఎంతగానో ఆశించాను. కాని ఆ అవకాశం లభించలేదు," అన్నాడు దీనంగా యమదూత.

"నువ్వా విషయాలను గురించి విచారించకు. రణధీర్‌తో నేను నిన్ను గురించి అన్ని విషయాలు చెప్పాను. అతనికి నీమీద ఎలాంటి అనుమానమూ లేదు," అన్నాడు బాబాజీ యమదూతకు ధైర్యం చెబుతూ.

యమదూత ఇంకేమీ అనలేదు. మౌనంగా కూర్చుండి పోయాడు.

"మాట్లాడాలన్న విషయాలేమిటో ఇక నిస్సందేహంగా మాట్లాడవచ్చు," అన్నాడు బాబాజీ.

యమదూత నెమ్మదిగా చెప్ప నారంభించాడు.

"కొన్ని ముఖ్యమైన సంగతులు మీతో చెప్పాలి. అవి మంత్రిసాధుకు సంబంధించినవి. అతను చేసిన, చేస్తున్న దుష్కృత్యాల నరికట్టడం నా వల్లకాదు. వాటిని కనుక్కో వడం మాత్రమే నా వంతు. వాటిని అరికట్టడానికి మీరుగాని, రఘువీర్ మహారాజుగారుగాని పూను కోవాలి. అయితే ఎంత చెప్పినా మీరు మంత్రి సాధును గురించి అనుమానిస్తున్నట్టే లేదు."

బాబాజీ యమదూత ముఖంకేసి పరిశీలించి చూస్తూ అన్నాడు.

"మంత్రిసాధును నేను అనుమానించడంలేదని నువ్వు బాధపడుతున్నట్టుంది. కాని అతనే జరుగుతున్న దుష్కృత్యాలకు కారకుడని మీరెవరూ నిరూపించి చూపడంలేదు."

"ఈసారి నిరూపించడానికే ఇక్కడికి వచ్చాను. భూగృహం మహారాజుగారిని సంహరించడం మొదలుకొని మంత్రిచేసిన పనులన్నీ నా అనుచరులు కళ్ళారా చూశారు. నా అనుచరులలో కొందరు మంత్రి అనుచరులుగా మారు వేషాలలో తిరుగుతూ ఈ విషయాలన్నీ కనిపెడుతున్నారు. ఇంత కాలానికి నాకు మంత్రిసాధు రహస్య స్థావరం తెలిసింది. నేను మారు వేషంలో అక్కడికి వెళ్ళాను. అక్కడ సాధును బికారిని చూశాను కూడా. ఈ మధ్య జరిగిన పాప కృత్యాలన్నీ తామే చేసినట్లు వాళ్ళు నా ముందు అంగీకరించారు కూడా." అన్నాడు యమదూత దృఢస్వరంతో.

బాబాజీ ఆశ్చర్యంగా యమదూత వంక చూశాడు.

"ఐతే నన్ను వెంటనే ఆ రహస్య స్థలానికి తీసుకు వెళ్లు. అవసరమైతే నేను కూడా మారువేషంలోనే అక్కడికి వస్తాను." అన్నాడు నిశ్చయ పూర్వకంగా.

"అందుకు సిద్ధంగా నేను వచ్చాను. మనం చీకటిపడిం తర్వాత అక్కడికి బయలుదేరి వెళ్ళాలి. సమరసింహుడు మొదలైన ఖైదీలందరు అక్కడే ఉండి ఉంటారని నా నమ్మకం." యమదూత అన్నాడు.

"కేవలం మనం వెళ్తే చాలా? లేక మనతో పాటు మరి కొందరు అనుచరులు కూడా కావలసి వస్తారా?" అని ప్రశ్నించాడు బాబాజీ అనుమానంగా.

"ఎవరూ అక్కరలేదు. అక్కడున్న వాళ్ళను ఎదుర్కొనడానికి మనమిద్దరం చాలు." అన్నాడు యమదూత.

"అయితే ప్రయాణం సాయంకాలం ఖాయమేనన్న మాట?" బాబాజీ అడిగాడు.

"తప్పకుండా. మీరు సిద్ధంగా ఉండండి. నేనొక పని మీద బయటికి వెళ్ళి సాయంకాలానికి తిరిగి వస్తాను. చీకటి పడింతర్వాత మనం ఆ రహస్య స్థావరంలో ప్రవేశించవచ్చు," సమాధానమిచ్చాడు యమదూత.

బాబాజీ కుర్చీలో వెనక్కి వ్రాలాడు.

"మాలతికూడా అక్కడ ఉంటుందేమోనన్న అనుమానం నీకుందా?"

"ఒకవేళ ఉంటే ఉండవచ్చు. ఖాయంగా చెప్పలేను. మాలతిని అపహరించాల్సిన అవసరం మంత్రికేమీ ఉన్నట్టు కనిపించడంలేదు."

బాబాజీ ఏదో ఆలోచనలో పడ్డాడు.

"సాయంకాలం మీరు సాయుధంగా తయారై ఉండాలి. మత్తుమందు ప్రయోగాలు వగైరా శత్రువుల గూఢచారులు చేసే పనుల విషయంలో ముందుగానే జాగ్రత్త పడాలి," అన్నాడు యమదూత.

"ఆ విషయాలలో నేను తగు జాగ్రత్త వహిస్తాను. నువ్వు భయపడనక్కరలేదు," బాబాజీ అన్నాడు.

యమదూత తన ఆసనంమీదినించి లేచాడు. ఇంతలో బాబాజీ ఒక ప్రశ్న వేశాడు.

"మరొక ముఖ్య విషయం నాకు తెలిసింది. మంత్రిసాధు రఘువీర్ మహారాజా వధువును తారుమారు చేశాడని త్రిపుర నాతో అంది. ఇందులో ఎంతవరకు నిజం ఉందంటావ్?"

బాబాజీ ఆ విషయం ఎత్తగానే తన ఉత్తరాలపెట్టె విషయం బయట పడిందేమోనని యమదూత చాలా కంగారు పడ్డాడు. వెంటనే ఆ కంగారును అణచుకుని నెమ్మదిగా అన్నాడు.

"ఇంకా ఈ సంగతి నా చెవులదాకా రాలేదు. నా అనుచరులలో ఎవరూ ఈ విషయాన్ని గురించి నాకు చెప్పలేదు."

"ఇంత దారుణకార్యం మంత్రి చేస్తాడంటావా?" బాబాజీ అడిగాడు.

"ఏమో! ఎవరు చెప్పగలరు. స్వయంగా మహారాజునే హతమార్చగలిగిన వ్యక్తి ఇలాంటి పనులు చేస్తాడనడంలో ఆశ్చర్యమేముంది! అతను ఎంతటి దుర్మార్గపు పనులు చెయ్యడానికైనా సమర్థుడు. డబ్బుకోసం, అధికారంకోసం అతనేమైనా చెయ్యగలడు," అన్నాడు సమాధానంగా యమదూత.

'ఏ విషయమైనా నమ్మవచ్చు కాని ఈ విషయం మీద నమ్మక మేర్పడడం లేదు," అన్నాడు బాబాజీ.

"అందుకే ఈ విషయం పరిశీలించి నిజా నిజాలు తేల్చుకోవడం మంచిది. కేవలం అపోహలవల్ల ఏమీ ప్రయోజనం లేదు," అంటూ యమదూత ఒక్కడుగు ముందుకు వేశాడు.

బాబాజీ ఇంకేమీ మాట్లాడలేదు. లేచి తన గదివైపు నడిచాడు. యమదూత బాబాజీతో సాయంకాలం వస్తానని చెప్పి నెమ్మదిగా భవనంలోంచి బయటపడ్డాడు. ఓసారి మంథరను కలుసుకొని కొన్ని విషయాలు మాట్లాడిరావడం అతని అభిమతం.

మంథర భవనంలో ప్రశాంతంగా ఉంది. ఈ మధ్య భవనంలో చాలా మార్పులు జరిగాయి. చుట్టూ ఉన్న ప్రహారీగోడ మరింత కట్టుదిట్టంగా తయారుచేయబడింది. ముఖద్వారం వద్ద ఒక భటుడు కాపలా ఉంచబడ్డాడు.

భవనానికి వెనుక ప్రక్కగా రెండు మూడు గదులు పెంచబడ్డాయి కూడా. ఆ భవనంలో ఇన్ని మార్పులు ఎందుకు చేయబడ్డాయో, ఎవరు చేయింకారో మాత్రం తెలియదు.

భవనంలో ఉండేది మంథర, కపాలి మాత్రమే. ఇంతకు ముందూ వీళ్ళిద్దరే ఉన్నారు. ఇప్పుడు కూడా వీళ్ళిద్దరే ఉంటున్నారు.

బాగా ప్రొద్దెక్కింది. భోజనాదికాలు ముగిసిం తర్వాత మంథర తన గదిలోకి వచ్చి విశ్రాంతిగా కూర్చుంది. మరి కాసేపటికి కపాళికూడా అక్కడికి వచ్చాడు. చూస్తే అత నెక్కడికో బయటికి వెళ్ళి అప్పుడే వచ్చినట్టున్నాడు.

కపాళి గదిలోకి రాగానే అతనిని కూర్చోమని సంజ్ఞ చేసింది మంథర. అతను ఆమె కెదురుగా ఉన్న ఒక ఆసనంమీద కూర్చున్నాడు.

''ఏమిటి విశేషాలు?'' మంథర అడిగింది.

''పెద్ద విశేషాలు నాకేమీ తెలియడంలేదు కాని మంత్రి గారు, బికారి ఎందుకనో చాలా కంగారు పడుతున్నట్టు కనిపించారు,'' కపాళి అన్నాడు.

"ఎందుకనో తెలియలేదా ?"

"లేదు. హడావిడిగా తిరుగుతూ ఇద్దరూ కాసేపు నాతో ఏమీ మాట్లాడలేదు. నేను అక్కడ మౌనంగా కూర్చున్నాను."

"తర్వాతేం జరిగింది ?"

"చాలా సేపటికి బికారి నా దగ్గరికి వచ్చాడు. వెంటనే నేను మీరు చెప్పిన సంగతి అతనితో చెప్పాను."

"అతనేమన్నాడు ?"

"ఏమీ అనలేదు. మాలతిని మాత్రం జాగ్రత్తగా బంధించి ఉంచమని చెప్పి వెళ్ళిపోయాడు."

"మంత్రిగారు ఇప్పుడిక్కడికి రావడం లేదన్నమాట ?"

"లేనట్టుగానే కనిపిస్తోంది. ఆ ఇద్దరూ కంగారుపడుతూండడాన్నిబట్టి ఏదో ఇబ్బందిలో ఇరుక్కున్నారనిపించింది నాకు."

"అయితే వెళ్ళిన పని జరగలేదన్నమాట."

"లేనట్టే లెక్క."

మంథర ఆలోచనలో మునిగింది. బికారి ఒక్క క్షణం తర్వాత ఆసనంమీదినించి లేచాడు.

"బాగా ఆకలివేస్తోంది. భోజనంచేసి వస్తా," అంటూ అక్కడినించి క్రిందకి దిగి వెళ్ళిపోయాడు.

మరి కాసేపటికి మంథరకూడా క్రిందికి దిగి వెళ్ళింది. వెనుక ప్రక్కగా క్రొత్తగా కట్టిన గదుల వైపు నడిచింది. చివరికొక గదిలో ప్రవేశించి తలుపులు లోపలి ప్రక్కనించి బంధించింది.

తలుపులు మూసివేయగానే గదిలో బాగా చీకటిగా ఉంది. గదికి పై భాగాన రెండు చిన్న కిటికీలు తప్ప పెద్ద కిటికీ ఒక్కటైనా లేవు. అందుచేత లోపలికి వెలుగు అంతగా రావడం లేదు.

గదిలో పూర్తిగా తివాచీ పరచి ఉంది. మంథర తివాచీ మీదుగా ఒక మూలకు వెళ్ళింది. అక్కడ ఉన్న తివాచీని తొలగించి మూలగా ఉన్న రాతిపలకను ప్రక్కకు నెట్టింది.

అక్కడినించి లోపలికి మెట్లున్నాయి. ఆ మెట్లమీది నించి క్రిందకి దిగింది మంథర. అక్కడ వరుసగా రెండు మూడు గదులున్నాయి. అందులో ఒక గది ముందు ఆగి తన దగ్గర ఉన్న తాళపుచెవుల సాయంతో తాళం తెరచింది.

మంథర గదిలో అడుగు పెట్టింది. అడుగుల చప్పుడు వినగానే అక్కడ బందీగా ఉన్న యువతి తలపైకెత్తి కంగారుగా అటూ ఇటూ తన చూపులు పోనిచ్చింది.

ఆమె మాలతి. బంధింపబడి ఎక్కువకాలం కాక పోయినా బాగా చిక్కి శల్యమైపోయింది. నిరంతరం అశ్రుధార ప్రవహించడంవల్ల కనురెప్పల క్రింద నీటిచారలు కూడా కనిపిస్తున్నాయి. ముఖం చాలా దీనంగా కనిపిస్తోంది. ఆ చీకటి గదిలో ఉన్న చిన్న నూనె దీపపు కాంతిలో.

మాలతి మంథరను చూడగానే దిగాలుగా వెనక్కి వ్రాలింది. మంథర మందహాసంచేస్తూ మాలతి దగ్గరికి వెళ్ళింది.

"నేను నిన్ను ఖైదునుండి విడిపించడానికి వచ్చాను," అంది మంథర.

మాలతి ఆశగా మంథర వంక చూసింది. మంథర నవ్వుతూ అంది.

"అయితే నేనడిగే ప్రశ్నలకు నిజమైన సమాధానాలు చెప్పాలి."

మాలతి మారు పలకకుండా మంథర వంక చూస్తూ కూర్చుండిపోయింది.

"యమదూత నీ నాన్నకు ఒక ఉత్తరాల పెట్టె పంపాడు కదూ?" మంథర అడిగింది.

"ఒక పెట్టె ఏదో యమదూత మా నాన్నకు పంపాడు. ఆ సమయానికి నాన్నగారు భవనంలో లేకపోవడంచేత తెచ్చినతను దానిని నాకిచ్చి ఆయన కప్పగించమని చెప్పి వెళ్ళాడు," అని సమాధాన మిచ్చింది హీనస్వరంలో మాలతి.

'ఆ పెట్టె తెరచి చూశావా?"

"నేను చూడలేదు. అందులో ఏముందీ అసలు నాకు తెలియదు. ఆ రోజు ఆ పెట్టె నొకచోట భద్రంగా దాచాను. మరునాడు ఒక భటుడు నాన్నగారి దగ్గరినించి వచ్చాడు. అతని చేతికిచ్చి నేనా పెట్టెను ఆయనకు పంపాను."

"నువ్వు చెబుతున్న విషయాలన్నీ నిజమనిపించడంలేదు నాకు."

"నేను చెప్పిన విషయాలన్నీ నిజమే."

"అయితే ఆ పెట్టెలో ఉత్తరాలను నువ్వు చదవలేదన్న మాట !"

ఆ పెట్టెలో ఉత్తరా లున్నాయన్న సంగతే అసలు నాకు తెలియదు."

మంథర ఇంకేమీ అడగలేదు. మౌనంగా వెనక్కి తిరిగింది. తలుపులు మూసి తాళంవేసి సొరంగమార్గాన వెనక్కి వచ్చింది.

మంథర తన గదివైపు వెళ్తుండగా దారిలో కపాలి ఆమెను ఆపాడు. మాట్లాడకుండా ఏదో సంజ్ఞ చేశాడు. మంథర ప్రక్కకు జరిగింది.

"యమదూత మీకోసం వచ్చి కూర్చున్నాడు. భోజనం చేస్తున్నట్టు చెప్పాను," అన్నాడు కపాలి చెవిలో చెబుతున్నట్టుగా.

"ఎక్కడ ఉన్నాడు ?" మంథర నెమ్మదిగానే అడిగింది.

"మీ గదిలోనే," సమాధాన మిచ్చాడు కపాలి.

"ఎంత సేపయింది వచ్చి ?"

"ఎక్కువసేపు కాలేదు."

మంథర నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ తన గదివైపు నడిచింది. గదిలో ప్రవేశించగానే మందహాసం చేస్తూ అంది.

"ఎక్కడా దయమాపడం లేదు మామీద. బొత్తిగా శీతకన్ను వేశారు."

యమదూత చిరునవ్వు నవ్వాడు.

"నిజంగానే తెలుసు. ఎగతాళిగా చెప్పడం లేదు," అన్నాడు యమదూత మళ్ళీ నవ్వుతూ.

యమదూత ఈ మాటలు చెబుతూ మంథర ముఖకవళికలను పరీక్షించసాగాడు. ఆమె ఎందుకో కంగారు పడుతున్నట్టుగా అతనికనిపించింది. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనం వహించడం చూసి యమదూత మళ్ళీ అన్నాడు.

"ఆ ముఠాలో ఒక స్త్రీ కూడా ఉంది."

ఈ మాటలన్నీ విని మంథర మరింత కంగారు పడింది. కాని ఆ కంగారును అణచుకోడానికి ప్రయత్నిస్తూ అంది.

"ఈ సంగతి సాధుగారు, బికారి కూడా అనుకుంటుండగా విన్నాను. ఆ స్త్రీ ఎవరో మీకు తెలుసా ?"

"తెలుసు. కాని ఇప్పుడు చెప్పను. కొద్ది రోజుల్లో ఆ స్త్రీ ఎవరో నీకే తెలుస్తుంది." అన్నాడు యమదూత మళ్లీ మందహాసం చేస్తూ.

మంథర మళ్ళీ మౌనం వహించింది. యమదూత విషయం మారుస్తూ అడిగాడు.

"మంత్రిగాని, బికారిగాని ఈ రోజు ఇక్కడికి వచ్చే సూచనలేమైనా ఉన్నాయా ? వాళ్ళతో కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలనుకుంటున్నాను."

"వాళ్లు ఈ రోజు ఇక్కడికి వస్తారన్న నమ్మకం నాకు లేదు. ఈ మధ్య ఠంచనుగా ఇటు రావడం లేదు. ఏవో పనుల్లో హడావిడిగా తిరుగుతున్నట్టున్నారు." అంది మంథర.

యమదూత చూపులు గది నాలుగు మూలలకీ పరుగెత్తాయి. కొంచెం కఠినంగా మంథర వంక చూస్తూ అతనన్నాడు.

"ఈ మధ్య మంత్రి సాధు, ఓకార్ల ప్రవర్తన బాగుండ లేదని చాలమంది అనుమానిస్తున్నారు. తద్వారా కొందరికి నీమీద కూడా ఏవో కొన్ని విషయాలలో అనుమానం ఉంది. ఎందుకైనా మంచిది జాగ్రత్తగా ఉండమని నేను సలహా ఇస్తున్నాను."

"ఎవరైనా నన్ననుమానిస్తే అందుకు బాధ్యురాలిని నేను కాదు. నా దగ్గరికి నలుగురు వ్యక్తులు వచ్చి పోతూ ఉంటారు. వాళ్ళనుబట్టి నన్ననుమానించడం తెలివి తక్కువ."

అంది మంథర ధైర్యాన్ని కూడగట్టుకొని నెమ్మదిగా.

"నేను చెప్పవలసింది చెప్పాను. తర్వాత నీ ఇష్టం. కొందరు గూఢచారుల కళ్ళు నీమీద కూడా ఉన్నాయి."

అంటూ యమదూత తన ఆసనంమీదినించి లేచాడు.

మంథర ఆలోచనలో మునిగిపోయింది. యమదూతతో ఇంకేమీ మాట్లాడటానికి ఆమెకు మనస్కరించలేదు. యమదూతకూడా ఇంకేం మాట్లాడకుండా మౌనంగా గదిలోంచి బయటికి నడిచాడు.

## 10

చీకటి అన్నిదిక్కులా అలముకుంది. యమదూత, బాబాజీ మారువేషాల్లో గుర్రాల మీద ప్రయాణంచేస్తూ ముందుకు సాగిపోతున్నారు. చీకట్లో దారి కనిపించక

పోయినా అడవిలో ప్రయాణానికి అలవాటుపడిన గుర్రాలు వేగంగానే పరుగుతీస్తున్నాయి.

ముందు వెళ్తున్న యమదూత గుర్రం అకస్మాత్తుగా ఆగిపోయింది. వెనక వస్తున్న బాబాజీ గుర్రం కూడా ఆగిపోక తప్పలేదు.

"మనం ఇక్కడినించి నడచి వెళ్దాం. గుర్రాలను ఇక్కడ వదలి వెళ్లడం మంచిది. కొంచెం ముందుకు వెళ్తే చెట్లులేని మైదానంలో ప్రయాణం చేయవలసి వస్తుంది," అన్నాడు యమదూత.

బాబాజీ అంగీకార సూచకంగా తల ఊపాడు. ఇద్దరూ గుర్రాల మీదనించి దిగి గుర్రాలను అడవిలో అక్కడే వదలి కాలినడకని ముందుకు సాగారు.

కొంతసేపటికి ఇద్దరూ మైదానం దాటి కొండలబారు వెంబడి ప్రయాణం ప్రారంభించారు. ఆ కొండలబారును చూస్తే బాబాజీకి పూర్వస్మృతులేవో గుర్తుకు రాసాగాయి. ఆ కొండలబారులోని కొన్ని గుహాలలోంచి సొరంగ మార్గాలు కూడా ఉన్నాయని బాబాజీకి తెలుసు. ఆ మార్గాలలో ఆయన ఇదివరకనేకసార్లు ప్రయాణంచేశాడు కూడా.

ఒక గుహ ముందు యమదూత ఆగిపోయాడు. చుట్టూ చీకటితో పాటు గంభీరమైన నిశ్శబ్దం కూడా ఆవరించి ఉంది. ఓసారి చుట్టూ కలయచూసి యమదూత గుహలో ప్రవేశించాడు. బాబాజీ అతని ననుసరించాడు.

సొరంగం గుండా నడచి తలుపుతీసి అవతలి గదిలో అడుగుపెట్టాడు యమదూత. కాని అక్కడ కాపలాభటుడు

కనిపించలేదు. గదిలో మరెవరూ లేరు కూడా. యమదూత ఆశ్చర్యంగా ప్రక్క గదిలో ప్రవేశించాడు.

చుట్టూ బాగా చీకటిగానే ఉంది. ఆ చీకటిలోనే గది మధ్యగా నిలబడి యమదూత అన్నిప్రక్కలా పరిశీలించి చూడసాగాడు. కాని ఎక్కడా ఎవరూ ఉన్న లక్షణాలు కనిపించడం లేదు. యమదూత ఆశ్చర్యం మరింత ఎక్కువైంది. ఇంత త్వరలో అక్కడి వ్యక్తులు, ఖైదీలు ఎలా మాయమయ్యారా అని ఆలోచించసాగాడు.

అకస్మాత్తుగా వెనుక తలుపు బంధింపబడిన చప్పుడు వాళ్లకు వినిపించింది. మరుక్షణంలో యమదూత తలుపు వైపు చూశాడు. తలుపుకు అవతలివైపున తాళం వేయబడినట్టుంది. తలుపు తెరవడానికి ఏ మాత్రం వీలుపడలేదు. బాబాజీ యమదూత వైపు వింతగా చూశాడు. యమదూత కంగారుగా బాబాజీ మొహంకి తన చూపులు పోనిచ్చాడు.

— (౦) —

రహస్య స్థానంలో చిక్కుకున్న యమ
దూత, బాబాజీ ఏం చేశారు?
మంథర భవనంలో బంధింపబడిన
మాలతి పరిస్థితి ఎలా పరిణమించింది?
మంత్రిసాధు, టికారి తమ ఖైదీలను
ఏం చేశారు? తర్వాత ఏం జరిగింది?
మొదలైన విషయాలు మహామాయ 23వ
పుస్తకం 'దివ్యదృష్టి'లో చదవండి.

నేం సకాలంలో పుస్తకాలు వెలువరించినా ఏజెంట్లు చాలా ఆలస్యంగా ఆర్డర్లు పంపుతున్నారు. ఈ సీరియల్ ముగింపు సమయంలో క్రింద ప్రకటించిన తేదీలలోపుగా ఆర్డర్లుపంపి మరుసటి నెలలో మరొక మహత్తరమైన సీరియల్ కోసం ఎదురు చూడగలరని నమ్ముతున్నాం.

జులై మాసాంతం లోపుగా

మహామాయ-23

# దివ్యదృష్టి

ఆగస్టు నెలాఖరం లోపుగా

మహామాయ-24

# నాదస్వరం

తప్పక వెలువడతాయి.

---

మహాభారతం, ఉపరేఖాశాస్త్రం, 4 అద్భుతమైన డిటెక్టివ్ ఊ మిస్టరీ కథలు; 2 చక్కని సాంఘిక కథలు, సినిమా క్విజ్ కలు, తారల చిత్రాలతో— లోపలకూడా రెండు రంగుల చిత్రాలతో

ఆగస్టు **కథానిక** వెలువడింది

వెల 4 అణాలు మాత్రం

ఇంకా ఆర్డర్లు పంపని ఏజెంట్లు తక్షణం పంపాలి.

విజ్ఞాన సాహితి

టి. నగర్ మద్రాసు-17

## ఎదురు చూడండి !

మహత్తరమైన డిటెక్టివ్ & మిస్టరీ సీరియల్ మహామాయ
24 భాగాలతో ఆంధ్రపాఠక లోకాన్ని ఉర్రూత
లూగించిన కనకమేడల కలంనుండి వెలువడు
తున్న మరొక అద్భుతమైన—
డిటెక్టివ్ సీరియల్

# ఇంద్రజిత్

ఆగస్టు 15 వ తేదీనుండి నెలకు రెండు మూడు
పుస్తకాల చొప్పున క్రమంగా వెలువడుతుంది.

పాఠకులు ఎన్నడూ చదివి ఎరుగని విచిత్ర సన్నివేశాలు,
ఆశ్చర్యకరమైన సంఘటనలు—ఎన్నో హత్యలు,
మోసాలు—కుట్రలు, దగాలు !

హంతకుల ముఠా అమానుష చర్యలు !
అచంచలంగా నిలిచే డిటెక్టివ్ ఇంద్రజిత్ !
భయం ! సంభ్రమం !! ఆశ్చర్యం !!! ఆనందం !!!!

పాఠకులు తమ ప్రతులు స్థానిక ఏజెంట్ల వద్ద రిజర్వుచేసుకో
వలసిందిగా కోరుతున్నాం. ముందుగానే ఏజెంట్లు
తమ ఆర్డర్లను సొమ్ముతోపాటు పంపాలి.

---

విజ్ఞాన సాహితి
టి. నగర్ : : మద్రాసు-17

మేం సకాలంలో పుస్తకాలు వెలువరించినా
ఏజెంట్లు చాలా ఆలస్యంగా ఆర్డర్లు పంపుతున్నారు.
ఈ సీరియల్ ముగింపు సమయంలో క్రింద ప్రక
టించిన తేదీలలోపుగా ఆర్డర్లుపంపి మరుసటినెలలో
మరొక మహత్తరమైన సీరియల్ కోసం
ఎదురు చూడగలరని నమ్ముతున్నాం.

జులై మాసాంతం లోపుగా

మహామాయ-23

# దివ్యదృష్టి

ఆగస్టు మొదటివారం లోపుగా

మహామాయ-24

# నాదస్వరం

తప్పక వెలువడతాయి.

---

మహాభారతం, ఉమర్‌ఖయ్యాం, 4 అద్భుతమైన
డిటెక్టివ్ ఊ మిస్టరీ కథలు, 2 చక్కని సాంఘిక
కథలు, సినిమా శీర్షికలు, తారల చిత్రాలతో—
లోపలకూడా రెండు రంగుల చిత్రాలతో

ఆగస్టు **కథానిక** వెలువడింది

వెల 4 అణాలు మాత్రం

ఇంకా ఆర్డర్లు పంపని ఏజెంట్లు తక్షణం పంపాలి.

విజ్ఞాన సాహితి

టి. నగర్ మద్రాసు-17

పాఠకలోకంలో మహత్తరమైన సంచలనం కలుగ చేసి తెలుగు భాషలో సీరియల్ నవలా ప్రచురణకు నాంది పలికిన నవల మహామాయ.

మహామాయ సీరియల్‌ను ప్రశంసిస్తూ అనేక మంది పాఠకులు పంపుతున్న అభిప్రాయాలను పుస్తకాలలో ప్రకటించడానికి తావులేనందుకు విచారిస్తున్నాం. మా నవలలు మిమ్మల్ని ఆనందపరుస్తున్నాయని తెల్పినందుకు మేం ఎంతో సంతోషిస్తున్నాం.

మహామాయ
21
**తా**
**రు**
**మా**
**రు**

ఈ డిటెక్టివ్ అండ్ మిస్టరీ సీరియల్‌లోని ప్రతి పుస్తకాన్ని తప్పక చదివి ఆనందించాల్సిందే. వెంటనే అన్ని పుస్తకాలూ తెప్పించుకొని చదవండి.

**A VIGNANA SAHITI PUBLICATION IN TELUGU**